# జీవితంలో విజయం సాధించాలంటే?




రచన:

బ్రహ్మావిద్వరిష్ఠ

తటవర్తి రాజ్యలక్ష్మి

# జీవితంలో విజయం సాధించాలంటే?



రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : ఫిబ్రవరి, 2026

ప్రతులు : 2,000

వెల : రూ. 40/-

పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్టత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 16) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 17) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 18) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 19) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# జీవితంలో విజయంసాధించాలంటే?

ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన మీరందరూ ప్రతి రోజు ధ్యాన సాధన చేస్తున్నారు. కానీ మీరు మీ జీవితంలో విజయం సాధించాలి అంటే సాధన ఒక్కటే సరిపోదు, జ్ఞానం నేర్చుకోవాలి, గురువుల ద్వారా విన్న ప్రతి విషయాన్ని ఆచరణలో పెట్టుకోగలగాలి, అప్పుడే ఈ మార్గంలో మీరు ఎదగడమే కాదు, జీవితంలో విజయం సాధించగలరు.

గురువు చెప్పిన విషయాలు ఆచరణలో పెట్టుకోలేకపోవడానికి కారణం మనసు కాబట్టి "శ్వాస మీద ధ్యాస" సాధన ద్వారా మనస్సును శుద్ధి చేసుకోవాలి. మీ జీవితంలో అనుకున్నది మీరు సాధించలేకపోతున్నారు అంటే మీలో ఉన్న చిన్న చిన్న లోపాలు అని గమనించుకొని వాటిని సరిచేసుకోవాలి. అప్పుడే మీరు జీవితంలో విజయాన్ని పొంది అనుకున్నది సాధించగలరు. మీలో ఉన్న లోపాలు ఏమిటో తెలుసుకుందాం.

**1) "ప్రతిక్షణం మిమ్మల్ని మీరు గమనించుకోవాలి"**

ఈ మార్గంలోకి వచ్చి సాధన చేస్తూ, జ్ఞానం నేర్చుకుంటూ కూడా ఇంకా కొంతమంది ఎదుటివారిని విమర్శించటం, ఎదుటి వారిలో తప్పులను ఎత్తి చూపటం చేస్తూ ఉంటారు. ముందు ఆ తప్పులు మీరు చేస్తున్నారా? లేదా? అని మిమ్మల్ని మీరు విచారణ చేసుకోవాలి.

అటువంటి తప్పులు చేస్తున్నట్లయితే వాటిని సరిచేసుకుని ఇతరులకు ఆ తప్పులు చేయకూడదు అని చెప్పాలి, అంతే కాని మీరు తప్పులు చేస్తూ వారికి చెప్పకూడదు.

మీరు త్రికరణ శుద్ధితో ఉంటూ అంటే ముందు మీరు తప్పులు చేయకుండా ఎదుటి వారికి చెబితే ప్రకృతి యాక్సెప్ట్ చేస్తుంది, కానీ మీరు తప్పులు చేస్తూ సలహాలు ఇస్తే ప్రకృతి యాక్సెప్ట్ చేయదు. అందుకే ఎవరికైనా

సలహా ఇచ్చేటప్పుడు అది మనం పాటిస్తున్నామా? లేదా? అని మిమ్మల్ని మీరు గమనించుకోవాలి.

ఒకసారి రామకృష్ణ పరమహంస దగ్గరకు ఒక ఆవిడ, తన పిల్లవాడిని తీసుకొచ్చి "మా అబ్బాయి స్వీట్స్ ఎక్కువగా తింటున్నాడు గురువుగారు, తినకూడదు అని ఎంత చెప్పినా వినడం లేదు, వాడి చేత స్వీట్స్ మానిపించే మార్గం చెప్పండి" అని ఆవిడ అడిగింది.

అప్పుడు రామకృష్ణ పరమహంస "వారం రోజుల తర్వాత పిల్లవాడిని తీసుకునిరా అప్పుడు చెబుతాను" అని అన్నారు. వారం రోజుల తర్వాత ఆ పిల్లవాడిని తీసుకొని తల్లి వచ్చినప్పుడు "స్వీట్స్ ఎక్కువగా తినకు, తింటే నీపళ్లు పాడవుతాయి" అని రామకృష్ణ పరమహంస పిల్లవాడికి చెప్పాడు.

అప్పుడు ఆ తల్లి "గురువు గారు ఈ మాటేదో అప్పుడే చెబితే ఇంత దూరం వచ్చే పని ఉండేది కాదుగా" అని అంది. అప్పుడు రామకృష్ణ పరమహంస "స్వీట్స్ అంటే నాకు ఇష్టమే, నేను తినటం మానేస్తేనే కదా? మీ బాబుకు నేను చెప్పగలను, అందుకే వారం సమయం అడిగాను, ఈ వారం సమయంలో నేను తినడం మానేసాను. అందుకే ఇప్పుడు నేను చెప్పగలుగుతున్నాను" అని అన్నారు. దీన్ని బట్టి మహాత్ములందరూ కూడా వారు ఆచరించి మనకు బోధిస్తారు అని తెలుసుకోవాలి.

**2) "మన జీవితంలో ఏమి జరుగుతున్నా స్వీకరించగలగాలి:"**

కొంత మంది అనుకున్నది సాధించ లేకపోతే బాధ పడతారు. పిల్లలకు తక్కువ మార్కులు వస్తే వారిని మందలిస్తారు. ఈ విషయంలో పత్రి గారు మనకి ఒక మాట చెప్పారు "మీ పిల్లలు పరీక్షలో 20 మార్క్స్ వచ్చాయి అనుకోండి, మీరు వారిని తిట్టకుండా నువ్వు చదివిన దానికి 20 మార్క్స్ వచ్చాయి కాబట్టి ఇంకా కష్టపడితే 60 మార్క్స్ తెచ్చుకోగలవు" అని చెప్పి వారిని ప్రోత్సహించాలి అని చెప్పారు.

అప్పుడు వాడు అది అర్ధం చేసుకొని ఈసారి ఇంకా మంచి మార్కులు తెచ్చుకుంటాడు అంతే గాని వాడి నిరుత్సాహ పరచకూడదు. మీ జీవితంలో ఏం జరుగుతున్నా అంగీకరిస్తూ ఎదగాలి. ఒకసారి ఫెయిల్ అయినా మరలా ప్రయత్నిస్తే సక్సెస్ అవుతారు, అంతే గాని దుఃఖపడుతూ కూర్చోకూడదు.

**3) "విజయానికి తొలి మెట్టు అపజయమే అని గుర్తుపెట్టుకొని అపజయాలకు భయపడకుండా ముందుకు సాగితే విజయం మీదే అని గుర్తుపెట్టుకోండి."**

నా జీవితంలో విజయానికి, అపజయానికి కారణం నేనే అని తెలుసుకొని సమ స్థితిలో ఉండ గలగాలి. అపజయం కలిగితే వారి వల్ల, వీరి వల్ల ఇలా జరిగింది అని ఎదుటివారిని నిందించడం చేయకూడదు. ఎక్కడ లోపం జరిగింది అని విచారణ చేసుకుంటూ ముందుకు సాగాలి. మీరు చేసే పనిలో శ్రద్ధ, పట్టుదల, కృషి ఉంటే విజయం మిమ్మల్ని వరిస్తుంది అని గుర్తుపెట్టుకోవాలి.

నేను కలెక్టర్ అవ్వాలి అనుకుంటే కలెక్టర్ అవ్వరు కదా? దానికి తగ్గ కృషి ఉండాలి. కొంతమంది దేవుడికి మొక్కుకొని, దేవుడిపైన భారం వేసి, ఆ దేవుడి దయ వల్ల వారు అనుకున్న పనులు అయిపోతాయి అని అనుకుంటారు. మీ కృషి, పట్టుదల లేకుంటే ఏ పనిలోనూ మీరు సక్సెస్ కాలేరు. మీ జీవితంలో జరిగే ప్రతి సంఘటనకు మీరే బాధ్యులు. ఎవరి వల్ల ఏమీ సాధించలేరు, మీ విజయానికి మీరే కారణం.

**4)"ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారం అనేవి జీవితంలో ఉండకూడదు:"**

**ద్వేషం:** ఎవరైనా మిమ్మల్ని ద్వేషిస్తే **"గతంలో నేను అహంకారంతో వాడికి ఏదో అపకారం చేసి ఉంటాను, అందుకే వాడు నన్ను ద్వేషిస్తున్నాడు"** అని మౌనంగా ఉండాలి. అలా కాకుండా వాడి మీద పది మందికి పదే పదే చెబుతుంటే మీకు సాధన కుదరదు, మీలో నెగెటివ్ ఆలోచనలు పెరిగిపోతాయి. అందుకే అటువంటి వారిని క్షమించి వదిలేయాలి. ఈ సృష్టిలో క్షమకు మించిన

గుణం లేదు. అటువంటి వారిని మీరు వదిలేయగలిగితే మీకు సాధన బాగా కుదురుతుంది, కర్మలు పెరగవు.

**అసూయ:** మీకన్నా ఉన్నతంగా ఎదిగిన వారిని చూసి అసూయ పడకూడదు. వాడి పూర్వ జన్మ పుణ్యం వలన వాడు అలా ఉన్నాడు అని అనుకోవాలి, వాడి మీద అసూయపడినా నాకు వచ్చే ప్రయోజనం ఏమీ లేదు అని తెలుసుకోవాలి.

**పగ, ప్రతీకారం:** కొంతమంది నాకు వాడి వల్ల అన్యాయం జరిగింది అని ఎదుటి వాడిమీద పగతో రగిలిపోతూ ఉంటారు. కానీ వాడు కూడా ఆత్మ స్వరూపుడని క్షమించి వదిలి వేయాలి. అది జ్ఞాని యొక్క లక్షణం. ఇంకా కొంతమంది ఎదుటి వాడి మీద ప్రతీకారం తీర్చుకోవాలి అని చూస్తారు. ఎదుటి వారి వలన కష్టం వచ్చిందని వాడి మీద ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తే ఆ పని వల్ల మీరు కర్మలు పోగేసుకుంటారు. జ్ఞాని తనకు అన్యాయం చేసిన వారిని కూడా క్షమించి వదిలిపెడతాడు.

అందుకే ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారం అన్నీ విజయానికి శత్రువులు. కాబట్టి మిమ్మల్ని ద్వేషించే వారిని క్షమించాలి, మీపై అసూయ పడేవారిని, పగ ప్రతీకారం చూపే వారిని వదిలి వేయాలి. ఈ నాలుగు గుణాలు వదిలినప్పుడు మీరు దైవ గుణాన్ని పొందుతారు, విజయం మిమ్మల్ని వరిస్తుంది.

**5) "భగవంతుడు మన చేత గొప్ప పనులు చేయించాలని అనుకుంటే ముందు చిన్న చిన్న పనులు మనకి ఇస్తాడు. అవి చిన్న చిన్న పనులే కదా! అని మీరు నిర్లక్ష్యంగా వదిలివేస్తే పెద్ద పనులు చేసే అవకాశం మీకు రాదు."**

చిన్న పనులు శ్రద్ధతో, పట్టుదలతో చేసి వాటిలో విజయం సాధించినప్పుడు, పెద్ద పెద్ద పనులు చేసే అవకాశం ఆ భగవంతుడు మీకు ఇస్తాడు. టెన్త్ పాస్ కాకుంటే కాలేజీ ఎలా చదవగలరు. అందుకే చిన్న చిన్న పనులే అని వాటి మీద అశ్రద్ధ పెట్టకుండా, వాటిని శ్రద్ధతో చేసి విజయం సాధించగలిగితే పెద్ద పెద్ద పనులు మీ ముందుకు వచ్చినప్పుడు వాటిని

అవలీలగా చేయగలరు.

కోరికలు, సంకల్పాలు ఉంటే సరిపోదు, వాటికి తగ్గ పట్టుదల, కృషి ఉండాలి. ఏ పనిలోనైనా సక్సెస్ రావాలి అంటే ఎన్నో అవరోధాలను ఎదుర్కోవాలి.

ఈ మార్గంలో మీకు వచ్చిన కష్టాలు, బాధలు అనేవి భగవంతుడు పెట్టే పరీక్షలు అని తెలుసుకుని చిన్న చిన్న త్యాగాలు చేస్తే మీరు ఎప్పుడూ ఆనంద స్థితిలో ఉంటారు. "భగవంతుడిని పొందాలి, ఆ సత్యలోకం చేరుకోవాలి" అనే పెద్ద పెద్ద సంకల్పాలు ఉండాలి, కానీ అవి నెరవేరాలంటే జీవితంలో జరిగే చిన్న చిన్న అవరోధాలను ఎదుర్కొంటూ, చిన్న చిన్న కష్టాలను ఓర్చుకుంటూ, సహనాన్ని పాటించాలి, అప్పుడు విజయం మిమ్మల్ని వరిస్తుంది.

ఎదుటివారిని విమర్శించే ముందు మిమ్మల్ని మీరు గమనించు కుంటూ ఇటువంటి తప్పులు నేను చేస్తున్నానా? అని గమనించుకుంటూ, విచారణ చేసుకుంటూ, ఆ తప్పులు మరలా చేయకుండా ఉంటే మీ జీవితంలో మీరు విజయం సాధిస్తారు. మీ జీవితంలో ఏది వస్తున్నా, ఏది పోతున్న, ఏం జరుగుతున్న  స్వీకరించ గలిగే శక్తి కలిగి ఉండాలి.

మీ జీవితానికి సృష్టికర్త మీరే. మీ జీవితంలో జరిగే విజయానికి కానీ, అపజయానికి కానీ కారణం మీరే కానీ వేరెవరు కాదు అని తెలుసుకొని ఎదుటి వారి మీద ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారాలు వదలాలి. ఈ నాలుగు గుణాలు విజయం సాధించడానికి పరమ శత్రువులు.

చిన్న చిన్న పనులు శ్రద్ధతో చేయగలిగినప్పుడు పెద్ద పెద్ద పనులు చేసే అవకాశం వస్తుంది. మీ సంకల్పం ఎంత పెద్దదో, మీ కృషి పట్టుదల కూడా అంతే ఉండాలి, వచ్చే అవరోధాలను ఎదుర్కోవాలి, చిన్న చిన్న త్యాగాలు చేయాలి. ఉదాహరణకు ఒక విత్తనాన్ని భూమిలో పాతినప్పుడు అది మహా వృక్షంగా అవ్వాలి అంటే ముందు ఆ విత్తనం లాగ త్యాగం చేయాలి. అంటే

భూమిలో విత్తనం పెట్టి నీరు పోసినప్పుడు కొన్ని రోజులకు ఆ విత్తనం రెండుగా చీలి దానిలోని అంకురం మొలక ఎత్తుతుంది. ఆ మొలక మహా వృక్షంగా మారుతుంది.

ఆ విత్తనం లాగే మీరు మీ జీవితంలో చిన్న చిన్న త్యాగాలు చేయకపోతే మహావృక్షం అనే శాశ్వతమైన ఫలాన్ని పొందలేరు. జీవుడిగా చనిపోయినా దేవుడిగా మారాలి. అంటే శరీరమే నేను అని కాకుండా ఆత్మే నేను అని, అందరు ఆత్మలే అని తెలుసుకుని జీవించాలి.

జీవుడిగా చనిపోవడం అంటే శరీరం లేకపోవడం కాదు, మనసు లేకుండా చేసుకోవడం అటువంటి వారే మహాత్ములు. మహాత్ములు త్యాగ బుద్ధిని పెంచుకుంటే మాధవలుగా మారతారు. అటువంటి వారికి శత్రువులకు కూడా సాయం చేసే శక్తి, ఓపిక, త్యాగం వస్తాయి. అందుకే జీవుడిగా ఉన్నవాడు దేవుడిగా ఎదగాలి. అలా ఎదిగిన వారు స్వార్థం లేకుండా త్యాగ బుద్ధి కలిగి ఉంటారు, బంధాలకు అతీతంగా బ్రతుకుతారు, వారి శ్రమని కానీ, శక్తిని కానీ, ధనాన్ని కానీ ఇతరుల ఆత్మ ఎదుగుదలకు ఖర్చు చేస్తారు.

శంకరాచార్యుల వారు, బుద్ధుడు జ్ఞాన ప్రచారం చేసే సమయంలో ఎన్నో మైళ్ళు కాలినడకన తిరుగుతూ ప్రచారం చేశారు. అందరిలోని అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానం నేర్పాలని వారిలో ఉన్న దుఃఖం తొలగించాలి, వారిని జ్ఞాన వంతులు చేయాలి అనే సంకల్పంతో ఎన్నో త్యాగాలు చేశారు.

మీరందరూ కూడా అన్ని చోట్లకు తిరుగుతూ జ్ఞాన ప్రచారం చేయాలి, అందరికీ జ్ఞానాన్ని బోధించాలి. మీలో కొంతమంది "మా భర్తలు బయటకి వెళ్ళటానికి ఒప్పుకోరు" అని అంటుంటారు, కానీ మీరు తీవ్ర సాధన చేస్తే ప్రకృతి మీకు అవకాశం కల్పిస్తుంది. జీవితంలో విజయం పొందటం అంటే ధ్యానం చేయడం, జ్ఞానము పెంచుకోవడం. అందుకే రాఘవరావు గారు మిమ్మల్ని విజయానికి దగ్గర చేయడం కోసం మీకు రకరకాల పరీక్షలు

పెడుతుంటారు. ఆన్ ద స్పాట్ లో క్లాస్ చెప్పమంటారు, చూడకుండా చెప్ప మంటారు, ఇదంతా మీ ఎదుగుదల కోసమే.

"నా జీవితానికి నేనే సృష్టికర్తను" అని జీవితంలో ఏమి జరిగినా అంగీకరించగలగాలి. ఎవ్వరి మీద ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారం ఉండకూడదు. అందరూ ఆత్మలే అని నీ హృదయంలో నాటుకు పోవాలి. చిన్న చిన్న పనులు శ్రద్ధగా చేస్తే పెద్ద పెద్ద పనులు ముందుకు వస్తాయి అని గుర్తుపెట్టుకోవాలి.

మీ సంకల్పం ఎంత పెద్దదో మీ శ్రమ, పట్టుదల, కృషి అదే స్థాయిలో ఉండాలి. విజయం కోసం ఎన్నో త్యాగాలు చేయవలసి ఉంటుంది, ఆ మార్గంలో ఎన్నో అవరోధాలు వస్తాయి అని గమనించుకోవాలి.

చివరిగా గురువు మాట మీద శ్రద్ధ ఉన్నవారు, గురువు చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టుకుంటూ విజయం సాధిస్తారు. మీరు ఆత్మ దర్శనం పొందిన రోజునే విజయం సాధించినట్లు.



# యోగ ఫలం పొందాలంటే?

పూర్వం ఋషులు, యోగులు మొదలైనవారు సాధన చేయాలంటే ఇల్లు వదిలి ఎక్కడో అడవులకు, హిమాలయాలకు వెళ్ళేవారు. కానీ ఇప్పుడు మీరు కొన్ని నియమాలు పాటిస్తూ ఇంట్లోనే ఉంటూ చక్కగా సాధన చేసుకుంటున్నారు. యోగ ఫలం పొందాలంటే మీ జీవితంలో మీరు ఎలా ఉండాలి? ఎలాంటి నియమాలు పాటించాలి? అని మలయాళ స్వామివారు చెప్పిన సందేశం తెలుసుకుందాం.

**1) సంతోషంగా జీవించాలి:**

సాధకుడు మొదట దుఃఖం, బాధలతో ఈ మార్గంలోకి వస్తాడు. గురువు ద్వారా వాటికి కారణాలు తెలుసుకొని సాధన చేసి వాటినుండి బయటపడి సంతోషకరమైన జీవితం జీవిస్తాడు.

మీ జీవితంలో వచ్చే సుఖసంతోషాలు, కష్ట నష్టాలు మీ కర్మ ఫలాలే అని తెలుసుకొని వాటి మీద దృష్టి పెట్టకుండా "నేను ఎంతో అద్భుతమైన సాధనా మార్గంలోనికి వచ్చాను, సరైన సద్గురువు దగ్గరకు వచ్చాను" అని ఎప్పుడూ సంతోషంగా ఉండాలి.

ఎందుకంటే ఎన్ని పూజలు, ఎన్ని నోములు, ఎన్ని వ్రతాలు చేసినా మీ కర్మలు దగ్ధం కావు, "ధ్యానం వల్ల జ్ఞానం పొందితే కర్మలు దగ్ధమవుతాయి". అని భగవద్గీతలో శ్రీకృష్ణులవారు చెప్పడం జరిగింది.

ఈ మార్గంలోకి వచ్చిన మీరు సంతోషంగా జీవిస్తూ ఎదుటి వారిని కూడా సంతోషంగా ఉంచగలగాలి . ఈ సాధన అనేది ఆనంద స్వరూపుడైన ఆత్మను పొందటానికే చేస్తున్నారు కాబట్టి ఎప్పుడు సంతోషంగా జీవించగలగాలి.

**2) నోటిని అదుపులో ఉంచుకోవాలి:**

మీ నోరు రెండు రకాలుగా పనిచేస్తుంది. ఒకటి మాటలు

మాట్లాడేందుకు, రెండోది ఆహారం తీసుకునేందుకు. మీకు యోగ ఫలం సిద్ధించాలి అంటే సాధన చేస్తున్న మీరు ఎప్పుడూ శుద్ధమైన సాత్వికమైన శాఖాహారం తీసుకోవాలి. అలాగే ఎప్పుడూ ఇతరులలో దోషాలు వెతకకూడదు, ఇతరులను దూషించకూడదు.

ఎదుటి వారి తప్పులను కాదు, మీరు ఏమి తప్పులు చేస్తున్నారు అని గమనించుకొని సరిచేసుకుంటే సాధన బాగా కుదురుతుంది. అందుకే నాలుకను నియంత్రించుకుంటూ ఇతరులను వేలెత్తి చూపకుండా మీ పనులు మీరు చేసుకుంటూ పోతే మీకు సాధన బాగా కుదురుతుంది. మీ మాట హితంగా, ప్రియంగా, శాంతంగా, సౌమ్యంగా, ప్రేమగా ఉండాలి.

**3) ధర్మము:**

ఈ భూమి మీద ప్రతి మానవుడికి జీవించే హక్కు ఉంది, కర్మలు చేసే హక్కు ఉంది. మరి మీరు చేసే కర్మలు ధర్మంగా చేస్తున్నారా, అధర్మంగా చేస్తున్నారా అని విచారణ చేసుకోవాలి. సాధకుడు ఎప్పుడు ధర్మాన్ని ఆశ్రయించాలి, ధర్మంగా జీవించాలి.

వ్యాస భగవానులు వారు "పరోపకారాయ పుణ్యం. పరపీడనం పాపం" అని చెప్పారు. అంటే ఇతరులకు ఉపకారం చేస్తే పుణ్యము, ఇతరులకు అపకారం చేస్తే పాపము అన్నారు. మీకు ఏ విషయం లో బాధ కలుగుతుందో, ఏ విషయం లో నష్టం కలుగుతుందో అటువంటివి ఇతరులకు చేయకుండా ఉండటమే ధర్మము.

అందుకే యోగ జీవితంలో బాహ్యంగా ధర్మవంతమైన జీవితం జీవించాలి, అంతరంలో సత్యాన్వేషణ అంటే ఆత్మను అన్వేషించాలి. అందుకే ధర్మవంతమైన జీవితం జీవిస్తే సత్యానికి దగ్గరవుతారు అని మలయాళ స్వామివారు చెప్పడం జరిగింది.

**4) దానము:**

మీరు దరిద్రులకు దానం చేయాలి. ప్రస్తుత సమాజంలో పెళ్ళి కానీ, పుట్టినరోజు కానీ ఇలాంటి ఫంక్షన్స్ లో వారి బంధువులను, వారి ఫ్రెండ్స్ ని పిలిచి ఎంతో వైభవంగా చేస్తున్నారు కానీ పేద వారికి, దరిద్రులకు ఎటువంటి దానము కానీ, సహాయం కానీ చేయరు. ఈ మార్గంలోకి వచ్చిన మీరు ఎటువంటి వారికి దానం చేయాలో గమనించుకోవాలి. గొప్పవారికే కాదు. సామాన్యులకు కూడా దానం చెయ్యాలి.

**5) సజ్జన సాంగత్యం:**

"సాధువులతో, సత్పురుషులతో, సజ్జనులతో చేసే సాంగత్యం సత్యానికి దగ్గర చేస్తుంది". ఈ ప్రపంచం మీద మమకారాన్ని తగ్గించుకొని, వైరాగ్యం పెంచుకొని, పరమాత్మ మీద మమకారం ఎలా పెంచుకోవాలో? ఒక సాధువు ద్వారా తెలుసుకోవచ్చు. సత్యాన్ని ఎలా దర్శించాలి? అనేది ఒక సత్పురుషుడి ద్వారా తెలుసుకోవచ్చు. సజ్జనులు భగవంతుడు ఎవరో తెలుసుకుని మంచి పనులు చేసేవారు.

ఇలా సాధువుల, సత్పురుషుల, సజ్జనుల సాంగత్యం వలన మీ సాధన బాగా కుదురుతుంది.

మీరు ఈ ప్రపంచంలో జీవిస్తున్నారు కాబట్టి సత్యం తెలిసినా కూడా అప్పుడప్పుడు మాయకు వశం అవుతూ ఉంటారు. మీరు మనసు ప్రభావంతో ఈ ప్రపంచం యొక్క ఆకర్షణలకు లోనవుతూ ఉంటారు. సజ్జన సాంగత్యం ద్వారా ప్రపంచం వైపు వెళ్ళే మనసును ఆత్మ వైపుకు మరల్చాలి. **"ప్రపంచంవైపు తిరిగిన మనసు మీకు శత్రువు అవుతుంది, అదే ఆత్మ వైపు తిరిగిన మనసు మీకు మిత్రుడు అవుతుంది".**

ఆహారం వల్ల మనసు ఏర్పడుతుంది కాబట్టి సాధకుడు తీసుకునే ఆహారం శుద్ధ సాత్వికంగా ఉండాలి. అలాగే ఒక రోజు ధ్యానం చేయకపోతే

ఏముందిలే అని అనుకుంటే మాయలో పడిపోతారు. అందుకే నిరంతరం ధ్యాన సాధన అవసరం అని తెలుసుకోవాలి.

**6) వైరాగ్యం:** ఈ సృష్టి అంతా నశించిపోయేదే, ఈ ప్రపంచం అంతా మిధ్యే, దాని వెనకాలే పడితే మిగిలేది దుఃఖమే అని ఎప్పటికప్పుడు విచారణ చేసుకుంటూ ఈ ప్రపంచం మీద వైరాగ్యం కలిగి ఉండాలి.

బయటకు కనపడేది అంతా మాయే. మీలో వున్న ఆత్మ సత్యం అని గురువుల బోధ ద్వారా తెలుసుకున్నప్పుడు మీరు సందేహించకుండా ఆచరణలో పెట్టుకున్నప్పుడు ఈ సాధనా మార్గంలో ఎదగగలుగుతారు.

**7) అహంకారం:** అహంకారం అనేది సాధకుడి దరిదాపుల్లో కూడా రాకూడదు. ఎందుకంటే మిమ్మల్ని క్రిందికి పడగొట్టేది అహంకారం. నేను శరీరం అనుకుంటే అహంకారం వస్తుంది, అందుకే సాధకుడు ఎప్పుడు ఆత్మగా జీవించగలగాలి.

ప్రాపంచికంగా జీవించినప్పుడు పేరు ప్రతిష్టలు, ధనము, విద్య అనేవి చూసుకుంటూ అహంకారంతో ఉంటారు. అదే ఆధ్యాత్మికంలోకి వచ్చాక జ్ఞానాన్ని సంపాదించుకుని బయటకు వెళ్ళి అందరికీ బోధించేటప్పుడు అందరూ "మీరు బాగా చెబుతున్నారు, మీకు చాలా జ్ఞానం ఉంది" అని పొగిడినప్పుడు అహంకారం రావచ్చు. అలా మాయలో పడకుండా "ఇది భగవంతుని కృప అని తెలుసుకుని మాయలో పడకూడదు".

**"తుమ్మెద ప్రతి పువ్వుమీద వాలి ఆ పువ్వు యొక్క అందాన్నీ, సుగంధాన్ని పోగొట్టకుండా ఆ పువ్వులోని మకరందాన్ని సేకరించి అందరికి తేనెను పంచినట్లు, ఒక సాధకుడు ఈ ప్రపంచం లోనే ఉంటూ అహంకార మమకారాలు, రాగద్వేషాలు అనేవి అంటించుకోకుండా సాధన ద్వారా జ్ఞానం పొంది ఆ జ్ఞానాన్ని అందరికీ పంచాలి".** తుమ్మెద తేనేను అందరికీ ఎలా ఇస్తుందో? మీరు కూడా జ్ఞానాన్ని అందరికీ పంచాలి.

# సామాజిక సత్యం, పరమ సత్యం

ఆత్మ దర్శనం చేసుకోవాలనే జిజ్ఞాస ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఈ మార్గంలోకి వచ్చిన మీరు శరీరం కాదు ఆత్మ అని, ఆత్మ అంటే భగవంతుడు అని గురువు ద్వారా తెలుసుకున్నారు. కానీ మీరు ఆత్మ అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారా? అంటే లేదు. ఎందుకు అంటే ఈ సృష్టిలో మీ కంటికి కనపడే ప్రతిది కూడా సత్యంలా అనిపిస్తుంది.

ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చిన మీరు చేయవలసినవి ఆత్మ కర్మలు. అంతేకానీ పుణ్య కర్మలు, పాప కర్మలు అనుభవిస్తే పోతాయి కానీ ఆత్మ కర్మలు ఆత్మ దర్శనాన్ని కలిగిస్తాయి అని తెలుసుకోవాలి.

ఆత్మ ప్రారంభ జన్మాలలో తమోగుణం, రజోగుణం కలిగి ఉండటం వలన శరీరాన్ని భోగాలలో బంధిస్తుంది. అందుకే ప్రారంభ జన్మలలో ఉన్నవారు శరీరమే నేను అన్నట్లుగా జీవిస్తుంటారు. అటువంటి కొన్ని జన్మలు తీసుకున్నాక సాత్విక గుణంలోనికి వచ్చి, ఈ యోగ మార్గంలోనికి వచ్చి ఆత్మే నేను, ఆత్మే భగవంతుడు అని తెలుసుకుంటారు. కానీ ఇంకా మీలో దేహ వాసన, సంఘ వాసన, సంసార వాసనలు వుండటం వల్ల బంధాలను వదులుకోలేరు, అలా అని భగవంతుడిని మరిచిపోలేరు.

ఇలాంటి సందిగ్ధ స్థితిలో మీరు ఉన్నప్పుడు మీ జీవితంలోకి ఒక సద్గురువు వచ్చి ఆ భగవంతుడిని చేరే మార్గం మీకు చూపిస్తాడు. అలాంటివారే మన గురువులైన పత్రి గారు, రాఘవరావు గారు.

ఈ సృష్టిలో జీవితం యొక్క పరమార్థమేమిటో ఒక్క మానవుడే తెలుసుకోగలడు, ఏ జీవి కానీ జీవరాశులు కానీ తెలుసుకోలేవు, ఆ అవకాశం ఒక్క మానవుడికి మాత్రమే ఇవ్వబడింది. మీరు మీ జీవిత లక్ష్యం ఏమిటి? ఎందుకు ఈ భూమ్మీదకు వచ్చాను? అని గురువు ద్వారా మీరు తెలుసుకున్నా,

మీ గత జన్మ వాసనల వల్ల, సంస్కారాల వల్ల అప్పుడప్పుడు ఎరుకను కోల్పోతూ ఉంటారు.

అందుకే మహాత్ములు రెండు సత్యాలు చెప్పారు. అవి 1) సామాజిక సత్యం 2) రెండు పరమ సత్యం.

వీటి గురించి వివరించుకుందాం.

**1) సామాజిక సత్యం:**

సామాజిక సత్యం అంటే ఇంచుమించు ప్రాపంచిక సత్యం అని చెప్పుకోవచ్చు. ఈ భూమిపై ఎటువంటి కర్మలు చేసినా వాటి ఫలితం ఉంటుంది అని మీకు తెలుసు. పూర్వ జన్మలో పుణ్యం చేస్తే ఈ జన్మలో భోగాలు అనుభవిస్తే ఆ పుణ్య ఫలం అయిపోతుంది. అలాగే పూర్వ జన్మలో చేసిన పాపానికి ఈ జన్మ లో దుఃఖం, బాధలు అనుభవిస్తే ఆ పాప ఫలం అయిపోతుంది, కానీ ఈ జన్మ లో ధ్యానం ద్వారా, పొందిన జ్ఞాన ఫలం మరు జన్మలో మీతో వస్తుంది.

దేహమే నేను, ఈ ప్రపంచం శాశ్వతం అనుకుంటూ, ఆ పరమాత్మ గురించి అవగాహన లేని వారు సామాజిక సత్యమే అసలైన సత్యం అనుకుని అలా కొన్ని జన్మలు పాప కర్మలు, పుణ్య కర్మలు చేస్తూ ఉంటారు.

అలా కొన్ని జన్మలు తీసుకున్న తర్వాత సాత్విక గుణంలోకి వచ్చి పుణ్య కర్మలు చేయడం మొదలుపెడతారు, ఎందుకంటే ఆ తర్వాత జన్మ మంచి జన్మ వస్తుంది అని. కానీ ప్రాపంచిక భోగాలు, సుఖాలు చూసుకుంటే మోక్షానికి అర్హత పొందలేరు. ఇహ,పర భోగాల మీద వైరాగ్యం కలిగినప్పుడే మోక్షానికి అర్హత సంపాదిస్తారు.

భగవద్గీతలో కూడా “క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి” అని చెప్పబడింది. అంటే స్వర్గంలో పుణ్య ఫలాలను అనుభవించితే, ఆ పుణ్య ఫలం అయిపోతుంది అన్నారు.

సాత్విక గుణంలోకి వచ్చినవారు పుణ్య కర్మలు చేసి ఫలితాన్ని ఆ భగవంతుడికి అర్పిస్తే వారికి హృదయ శుద్ధి అవుతుంది. ఈ మార్గంలోకి వచ్చిన వారందరూ కూడా కర్మ ఫలం త్యాగం చేయాలి. సన్యాసం తీసుకుని కాషాయం కట్టుకుంటే కర్మ ఫల త్యాగం చేసినట్టు కాదు, కర్మలు వదలడం కాదు, వాటి ఫలితాన్ని వదలాలి. పుణ్య కర్మలు చేయాలి కానీ వాటి ఫలితాన్ని పరమాత్మకు అర్పించాలి, అప్పుడే మీ హృదయం శుద్ధి అవుతుంది. అప్పుడే పరమాత్మను దర్శించుకోవాలి అనే జిజ్ఞాస మీలో మొదలవుతుంది. ఆ కోరిక తీరాలంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారా సద్గురు బోధించిన "జ్ఞానం" ద్వారా సాధ్యమవుతుంది అని తెలుసుకుంటారు.

**2) పరమసత్యం:**

పరమ సత్యం అనేది ఈ భౌతిక ప్రపంచానికి అతీతమైనది, శాశ్వత మైనది, మార్పు లేనిది. ఒక సద్గురువు ద్వారా సాధన, జ్ఞానం పొంది ఈ సృష్టి శాశ్వతమైనది కాదు, ఈ సృష్టిని సృష్టించిన భగవంతుడే శాశ్వతమైన వాడు అని తెలుసుకోవడమే పరమసత్యం. ఈ సృష్టిలో అణువు అంత ఉన్న **"ఈ భూమండలాన్ని చూసి ఇదే శాశ్వతం అని అనుకోవడం సామాజిక సత్యం అయితే... ఈ సృష్టిని సృష్టించిన ఆ సృష్టికర్తే శాశ్వతమైన వాడు అని తెలుసు కోవడమే పరమసత్యం".**

ఈ సృష్టిలో ఉన్న బ్రహ్మాండాలు మారతాయి, ఈ సృష్టిలో ఉన్నదంతా మార్పు చెందేదే కాని ఒక గడ్డి పోచ అంత కూడా మార్పు లేనివాడు పరమాత్మ. అశాశ్వతమైన ఈ సృష్టి సామాజిక సత్యం అయితే శాశ్వతమైన పర బ్రహ్మ పరమ సత్యం.

పరమ సత్యానికి హెచ్చుతగ్గులు ఉండవు. అటువంటి పరమ సత్యం తెలుసుకోవాలి అంటే నిరంతర ధ్యాన సాధన, నిరంతర జ్ఞాన పిపాస ఉండాలి. ఈ సృష్టిలో మీకు తెలియనిదంటూ ఏమి ఉండదు, ఎందుకంటే ఈ సృష్టి

అంతా వ్యాపించి ఉన్న ఆత్మ నీవే అయినప్పుడు నీకు తెలియనిది ఏమీ ఉంటుంది?

ఈ మార్గంలోకి వచ్చిన మీరందరూ బాహ్య దృష్టిని వదిలి అంతర్ దృష్టికి చేరుకోవాలి అంటే సామాజిక సత్యం నుంచి పరమ సత్యం వైపుకు తిరగాలి.

ఆత్మలైన మీరు ఆత్మలుగా జీవించ లేకపోతున్నారు అంటే ఆహార లోపం కానీ, మీ చుట్టూ ఉండే పరిసరాల ప్రభావం వల్ల కానీ మాయలో పడి సామాజిక సత్యాన్ని, పరమ సత్యంగా భావిస్తున్నారు. నేను, నాది అనే భావం ఉన్నంత వరకు పరమ సత్యాన్ని తెలుసుకోలేరు. వశిష్టుల వారు "విచారణే పరమాత్మ జ్ఞానం" అని చెప్పారు. జ్ఞానం ఎంత పెరిగింది? ఏ తప్పులు చేస్తున్నాము? ఎదుటి వారితో ఎలా ప్రవర్తిస్తున్నాం? అనే విచారణ ఎప్పుడు చేసుకుంటూ ఉండాలి. కొంత మంది కొన్ని అలవాట్లకు బానిసై తప్పులు, పాపాలు చేస్తుంటారు, కొంతమంది ఎదుటివారిని విమర్శిస్తూ ఉంటారు కానీ ఎదుటివారు కూడా ఆత్మ స్వరూపులే అని తెలుసుకొని వారిలో ఉన్న మంచిని తీసుకుని, చెడును వదిలేయాలి.

గురువు దగ్గర సాధన, జ్ఞానం నేర్చుకుంటూ, మీ జీవితంలో ప్రతి సంఘటనను విచారణ చేసుకుంటూ ఎదుగుతూ ఉండాలి. ఉదాహరణకు ఒక విద్యార్థి స్కూల్ కి వెళ్లి చదువుకుంటున్నప్పుడు ఆ తరగతిలో రోజుకు ఏడు పీరియడ్స్ ఉన్నప్పుడు ఒక్కో పీరియడ్‌కి ఒక్కో మాస్టర్, ఒక్కో సబ్జెక్టు బోధిస్తూ ఉంటారు. ఆ విద్యార్థి ఆ ఏడు సబ్జెక్టు చదివితేనే ఉత్తీర్ణత సాధిస్తాడు కానీ "నాకు ఒక్క సబ్జెక్టు అంటే ఇష్టం" అని ఆ ఒక్కటి చదివితే మిగతా వాటిలో ఉత్తీర్ణత సాధించలేడు, ఆ పై తరగతికి వెళ్ళలేడు. అలానే మీలో ఉన్న లోపాలను విచారణ చేసుకుంటూ ఒక్కొక్క లోపాన్ని సరిచేసుకుంటే ఈ మార్గంలో ఎదగగలుగుతారు.

పరమ సత్యం బోధించడానికే ఆ పర బ్రహ్మ గురువు రూపంలో వస్తాడు అని దక్షిణామూర్తి చెప్పారు. మీ జీవితంలో ఎందరో గురువులు వచ్చి ఉండొచ్చు కాని ప్రాపంచిక లాభాలు అంటే సామాజిక సత్యం కాకుండా పరమ సత్యం గురించి బోధించే గురువు "పరమాత్మ స్వరూపుడు" అని తెలుసుకోండి. అటువంటి గురువుకి మీరు శరణాగతి అయితే మీరు ఆత్మ జ్ఞానులు కాగలరు.

ఈ ప్రపంచంలో వందల సంవత్సరాల క్రిందట రాజులు కట్టిన ఎన్నో కోటలు ఉండేవి. అవి ఇప్పుడు మనకు కనపడటం లేదు అంటే అవి సామాజిక సత్యం కానీ పరమ సత్యం కాదు. ఎందుకు అంటే ఆ కోటలు అప్పుడు ఉన్నాయి కానీ ఇప్పుడు లేవు, అవి అశాశ్వతమైనవి. కానీ కాలాలు మారినా, యుగాలు మారినా మార్పు చెందినది పరమ సత్యం, మార్పు చెందని వాడే ఆ పరబ్రహ్మ.

ఈ సృష్టిలో ప్రతిదీ మార్పు చెందుతుంది అనేది సత్యమే కానీ అది సామాజిక సత్యం, మార్పు చెందనిది ఆ సృష్టికర్త అన్నది పరమ సత్యం అని మీరు తెలుసుకొని ఆత్మ కర్మల ద్వారా మీ హృదయం శుద్ధి చేసుకొని, మానవ జన్మ యొక్క పరమార్థం అయిన భగవంతుడి గురించి తెలుసుకునే ప్రయత్నం చేయండి. "హృదయం శుద్ధి చేసుకొని శుద్ధ స్వరూపమైన ఆత్మ దర్శనం పొందాలి" అనే జిజ్ఞాస మీలో ఉంటే మీ జీవితంలోకి సద్గురువు వచ్చి మిమ్మల్ని పరమ సత్యం వైపుకు నడిపించగలరు.

సద్గురువులు నిరంతరం ధ్యానం, జ్ఞానం బోధిస్తూ, ఆహార నియమాలు ఎలా పాటించాలి? ప్రాపంచిక వ్యవహారాల్లో ఎలా ఉండాలి? అనేటువంటి విషయాలు నిరంతరం బోధిస్తూ మిమ్మల్ని పరమ సత్యం వైపుకు తీసుకు వెళ్తారు.

# మానవజన్మ పరమార్థం

మానవ జన్మ పర్పస్ ఏమిటి? అసలు మానవ జన్మ ఎందుకు తీసుకున్నారు? అని ప్రశ్నించుకుంటే మీకు ఒక విషయం అర్థం అవుతుంది. మానవుడికి ప్రాపంచిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం రెండు ఉంటాయి.

మానవుడు ప్రాపంచిక జీవితంలో ఉన్నప్పుడు తమోగుణం, రజోగుణం వలన కంటికి కనపడేవన్నీ నిజం అనుకుని వాటిని అనుభవించాలని తాపత్రయ పడతాడు. ఎప్పుడైతే సాత్విక గుణంలోనికి వస్తాడో సత్యమంటే ఏంటో తెలుసుకొని సత్యానికి దగ్గరవుతూ సృష్టి అంటే ఏంటి? అది ఎలా ఏర్పడింది? ఎవరు సృష్టించారు? సృష్టి వెనుకాల ఎవరున్నారు? అనే విషయాలు తెలుసుకోవాలనే తపన మొదలవుతుంది. అప్పుడు తన జీవితంలోనికి ఒక సద్గురువు వస్తేనే ఇవన్నీ తెలుసుకోగలను అని అర్థం చేసుకుంటాడు.

మనం ప్రాపంచక జీవితంలో పరిమిత జ్ఞానంతో ఉంటాము కాబట్టి ప్రాపంచకమైన వాటి మీద ఆసక్తి చూపిస్తూ అవి ఉంటే సంతోషంగా, సుఖంగా ఉండొచ్చు అనే అభిప్రాయంతో ఉంటారు.

కానీ అవి అన్నీ అశాశ్వతం అని ఎప్పుడైతే తెలుసుకుంటారో! సంపూర్ణమైన సుఖం, శాంతి, ప్రేమ అనేవి సంపూర్ణమైన జ్ఞానం పొందినప్పుడు మాత్రమే దొరుకుతాయి అని మీ జీవితంలో ఒక సద్గురువు ద్వారానే తెలుసుకుంటారు. ప్రాపంచక జీవితం కంటే ఆధ్యాత్మిక జీవితం గొప్పదని, సృష్టి కంటే సృష్టికర్త గొప్పవాడు అని కొంతమంది శిష్యులు మాత్రమే తెలుసుకోగలుగుతారు. ఎందుకు అంటే గురువు దగ్గరికి వచ్చిన వాళ్ళలో కొంతమంది శిష్యులు మాత్రం ప్రాపంచిక లాభాలు ఆశించి వస్తారు, కొంతమంది మాత్రం ఆత్మజ్ఞానం పొందాలని, గురువు దగ్గరికి చేరుతారు.

మరి అలా గురువు దగ్గరికి చేరినప్పుడు ఈ దుఃఖాలకి కారణం

ఏమిటి? అనే ఒక పరమ సత్యాన్ని తెలుసుకుంటారు. ప్రాపంచిక జీవితంలో మనకు ఎప్పుడు కూడా భయం, చింత, ఉద్వేగం అనేవి ఉంటాయి. వాటి గురించి కొంచం వివరించుకుందాం.

**భయం:**

భయం అనేది ఎలా ఉంటుందంటే చనిపోతామేమోనన్న భయం, నా దగ్గర ఉన్నది ఎవరైనా తీసుకుంటారేమోననే భయం, పదవులు పోతాయని భయం, టాక్స్ కట్టాలేమోననే భయం, సంపాదించిన డబ్బు పిల్లలు పాడు చేస్తారేమోననే భయం ఇలాంటి రకరకాల భయాలు ఉంటాయి.

చిన్న పిల్లలకి ఒక రకం భయం, మధ్య వయసులో ఒక రకం భయం, ముసలి వయసులో ఒక రకం భయం ఇలా రకరకాలుగా ఉంటాయి.

ఇటువంటి భయాలకు ముఖ్య కారణం ప్రాపంచిక జీవితంలో ఏ సమస్య వచ్చినా విచారణ అనేది లేక విచారంతో ఉండటమే. ఎప్పుడైతే విచారణ ఉంటుందో విచారం ఉండదు.

**చింత:**

మీ కూడా రాని వాటి కోసం తాపత్రయ పడటమే పెద్ద చింత, లేని వాటి కోసం  ఎప్పుడు ఆలోచిస్తూ ఉంటారు. మీకు ఎన్ని ఉన్నా ప్రక్కవాడికి మీకంటే ఏదైనా ఒక్క వస్తువు ఎక్కువ ఉంటే మీరు చింతలో కూరుపోతారు. అంటే ఉన్నదానితో తృప్తి లేని జీవితం ఎప్పుడూ చింతలోనే ఉంటుంది అని అర్థం చేసుకోవచ్చు. ప్రాపంచక జీవితంలో నాకు అన్నీ ఉన్నాయి, నేను బాగున్నాను, నేను తృప్తిగా ఉన్నాను అనే మాట ఎవరి నోట రాదు. ఇంకా ఉంటే బాగుండును అనుకుంటారు.

**ఉద్వేగం:**

ఏ పని మొదలు పెట్టినా సక్సెస్ అవుతామో, లేదో అనే ఉద్వేగంతో ఉండటం.

ఈ మూడు కూడా ప్రాపంచిక జీవితంలో ఉంటాయి. ఎప్పుడైతే మీ జీవితంలోకి సద్గురువు వస్తాడో అప్పుడు ఈ భయాలు, చింతలు ఉద్వేగాలు అన్నీ తాత్కాలికమైనవేనని తెలుసుకుంటారు. ఎంత తాపత్రయపడ్డా, ఎంత భయంతో దాచుకున్నా, ఎంత చింతలో ఉన్నా మీ జీవితంలో జరిగేవన్నీ కూడా మీ కర్మానుసారమే జరుగుతాయి అని , చివరకు మరణం కూడా మీరు జన్మ తీసుకున్నప్పుడు ఎంతకాలం జీవించి ఉండాలో నిర్ణయించుకొని వస్తారని ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక అర్థం అవుతుంది.

ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చి కూడా ఇంకా మరణ భయం ఉంది అంటే గురువుగారు చెప్పిన జ్ఞానం నీకు సరిగా అర్థం కాలేదు అని తెలుసుకోవాలి. గురువు మీ జీవితంలోకి మరణ భయాన్ని పోగొట్టడానికే వస్తారు. గురువు చెప్పిన జ్ఞానాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే మరణ భయం, చింత ఉండవు.

మీకు ప్రాప్తంలో ఉన్నవే వస్తాయి కానీ, ప్రాప్తంలో లేనివి ఏవి రావు అని గురువు చెప్పినప్పుడు, ఏది రాకపోయినా " ఓ నేను పైనుంచి వచ్చేటప్పుడే దీన్ని నేను కావాలి అని అనుకోలేదు కాబట్టి నేను ఎంత ప్రయత్నించినా నాకు రాలేదు" అని చింత లేకుండా వుంటారు.

ఇంకా కొంతమంది ప్రతి దానికి ఆదుర్దాపడుతూ ఉంటారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎందుకు నాకే వచ్చింది? ఎందుకు నాకే ఇలా అవుతుంది? అసలు నేను అనుకున్న పని అవుతుందా? లేదా? అనే సంశయంతో ఉంటారు. అలాంటి సంశయచిత్తుడుకే ఉద్వేగం ఎక్కువగా ఉంటుంది. కానీ జ్ఞానం పొందినవాడు ఆ పని అవ్వలేదు అంటే దాని కంటే మంచిది ఇంకొకటి ఉందేమో అని అనుకుంటాడు, సంశయం చెందడు.

ఆధ్యాత్మికతలోకి వచ్చినవాడు, ఈ దుర్గుణాలు, భయం, చింత, ఉద్వేగం ఇవన్నీ కూడా మానసికమైన రోగాలు అని, జ్ఞానం పొందాక

తెలుసుకుంటాడు.

అలా సత్యం అవగతమైనప్పుడు ఈ సృష్టి అంతా భగవంతుడిదే అని అర్థమైనప్పుడు, నాది అంటూ ఏది లేదు అని తెలుసుకున్నప్పుడు, ఏ విషయానికి భయపడడు, చింతించడు, ఉద్వేగ పడడు. ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చినప్పుడు ఏవైతే ప్రాపంచిక జీవితంలో కోరుకున్నావో అంటే సుఖంగా, సంతోషంగా, శాంతిగా ఉండాలి, నేను స్వతంత్రంగా ఉండాలి లాంటి కోరికలు ఆధ్యాత్మిక జీవితంలో వాస్తవరూపం ధరిస్తాయి.

గురువు ద్వారా నువ్వు దేహం కాదు ఆత్మవి, ఆత్మకి ఈ దేహం తొడుగు మాత్రమే, నీ శరీరానికి వస్త్రం ఎలాగో అలాగే ఆత్మకి తొడుగే దేహం అని తెలుసుకుంటావు. ఆత్మ అంటే నీ కంటికి కనిపించని శక్తి అని తెలుసుకోవచ్చు.

నీ శరీరంలో ఉన్న అణువంత ఆత్మ నీ శరీరాన్ని నడిపిస్తుంది, బ్రహ్మాండం అంతా ఉన్న సర్వాత్మ ఈ సృష్టిని నడిపిస్తోంది అని నీ జీవితంలోకి గురువు వచ్చాక తెలుసుకొని నీ జీవిత పరమార్థం ఏమిటో తెలుసుకుంటావు.

ఎందుకు ఈ మానవ జన్మ అంటే "నిన్ను సృష్టించిన వాడిని, నీ జీవన ప్రదాతని తెలుసుకోవడానికి అనువైనదే ఈ మానవ జన్మ అని తెలుసుకుంటావు". ఇది తెలుసుకుంటే మరుజన్మ ఉండదు. కాని జన్మ ఉంటే దుఖమే కదా? దుఃఖం నుంచి శాశ్వతంగా విముక్తి పొందాలి అంటే నిన్ను సృష్టించిన వాడిని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

చాలామంది నేను అనుభవించడానికి ఈ భూమ్మీదకి వచ్చాను అని అనుకుంటారు. చాలామంది కష్టాలు అనుభవిస్తూ, కొన్ని పొందుతూ, కొన్ని పొందలేనప్పుడు "ఈ జీవితమంతా దుఃఖాలతో నిండి ఉంది, దుఃఖంతో కూడినదే ఈ జీవితం ఇంకేమి కాదు" అంటారు. కారణం ఆనంద స్వరూపుడైన ఆ పరమాత్మ తనలోనే ఉన్నాడు అని తెలియక. కాని అది తెలుసుకుంటే

జీవితం ఆనందమయం అవుతుంది.

ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక నేను శరీరం కాదు ఆత్మ అని తెలుసుకొని, నా జీవితంలో ఏది అవసరం, ఏది అవసరం లేదు గ్రహించటానికి వివేకం, వైరాగ్యం రెండు ఉండాలని తెలుసుకుంటాడు. వివేకం లేనివాడు ప్రాపంచిక వస్తువుల వల్లనే సుఖం వస్తుందనే భ్రాంతిలో ఉంటాడు. ఆ భ్రాంతిలో ఉండి, అవి పొందినా కూడా దుఖం తప్పదు.

పత్రిగారు లాంటి గురువు లభించి నప్పుడు ధ్యానం వల్ల జ్ఞానం, జ్ఞానం వల్ల మోక్షం అని తెలుసుకుంటారు. మోక్షం అంటే జీవించి ఉన్నప్పుడు ఆనందంగా ఉండటం, మరణించాక మరుజన్మ లేకుండా ఉండటం.

కానీ కొంతమంది ధ్యానము అంటే కోరికలు తీర్చుకోవడం కోసం అని, సంకల్పం పెట్టుకుని ధ్యానం చేస్తే కోరికలు తీరుతాయని అంతవరకే తెలుసుకున్నారు. కాని కోరికల వల్ల దుఖం అని తెలియదు. కానీ ధ్యానం ఆత్మజ్ఞానం, పొందటానికే కానీ ప్రాపంచకమైన వాటికోసం కాదు.

ఇప్పుడు మీరు ధనం సంపాదిస్తారు, ఆ ధనాన్ని పుణ్య కార్యక్రమాలకు ఉపయోగిస్తే భోగం వస్తుంది, మరు జన్మలో ఆనందంగా జీవిస్తారు. అలా కాకుండా ఆ డబ్బును దుర్వ్యసనాలకు ఉపయోగిస్తే దరిద్రమైన జీవితం జీవించవలసి వస్తుంది.

భూమిమీద నువ్వు పొందలేనిది, సాధించలేనిది ఏమి లేదు. కానీ సరియైన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయాలి.

ఏదేమైనా చివరకు తెలుసుకోవలసింది జ్ఞానం. ఆ జ్ఞానం పొందినప్పుడు "నాదంటూ ఏది లేదు, ఇదంతా పరమాత్మదే అని నీకు అర్థమవుతుంది. నాకు ఈ జీవితం నేను ఎవరో తెలుసుకోవడానికి, ఈ జీవితం ఇచ్చిన వాడిని తెలుసుకోవడానికి అని తెలుసుకుంటారు.

మానవ జన్మ పరమార్థం ఈ సృష్టికి కారణం ఎవరు? ఈ జీవుల

జన్మకి కారణం ఎవరు? నా జీవన ప్రదాత ఎవరు? అన్నది తెలుసుకోవడమే. నీవు విచారణ ద్వారా ఆ సత్యం తెలుసు కున్నప్పుడు, ఈ సృష్టి ఏమిటో అర్థం అవుతుంది.

కానీ మీరు ఎప్పుడూ కూడ మాయలో పడిపోతానేమో అని గమనించుకోవాలి. మాయలో పడితే ఈ ప్రపంచమే నేను అని అనుకుని దుఃఖానికి లోనవుతారు. ఈ మాయ అన్నది నువ్వు సరైన సాధన చేసి జ్ఞానం పొందితే, మాయలో పడవు.

పరమాత్మ కోసం ధ్యానం చేసిన వాడికి ఆయన అనుగ్రహంతో ఇహంలో ఆనందంగా జీవించి జన్మలేని స్థితికి చేరుకుంటాడు.

అలా సాధన చేసే కొద్ది ఈ భూమిమీద నా ఒక్కగానొక్క కోరిక, నా ఏకైక లక్ష్యం పరమాత్మను తెలుసుకోవడమే అని తెలుసుకుంటారు.

దానికి పరా విద్య అయిన ఆత్మ విద్య, బ్రహ్మ విద్య నేర్చుకున్నప్పుడు మాత్రమే తెలుస్తుంది. సాధన తీవ్రమైనపుడు నేను ఎవరో తెలుస్తుంది, సృష్టి ఎవరు సృష్టించారో అర్థమవుతుంది.

భీమవరంలో ప్రతినెలా 1,2,3 తారీఖులలో జరిగే ఆత్మజ్ఞాన శిక్షణా తరగతులు కానీ, ప్రతి రోజు ఉదయం జరిగే జూమ్ లో జరిగే సాధన కానీ, జ్ఞానం క్లాస్ లు కానీ ఇవి అన్ని సాధన పెంచుకోవడం కోసం ఆత్మానుభూతిని పొందటం కోసమే. ఇలా తీవ్ర సాధన చేయడం వల్ల మీ జీవితం యొక్క పరమార్థం తెలుసుకుంటారు, ఆ సృష్టి కర్త గురించి తెలుసుకుంటారు.

ఇలా ప్రపంచంలో నూటికో, కోటికో ఏ ఒక్కరో ఆ పరమాత్మ కోసం ప్రయత్నిస్తారు. ఆలోచించండి! ఆ పరమాత్మ కోసం చేసే ప్రయత్నంలోనే ఇంత ఆనందం ఉంటే! నిజంగా పరమాత్మను చేరుకున్నప్పుడు ఇంకెంత ఆనందం ఉంటుందో ఊహించండి.

# వ్యక్తం - అవ్యక్తం

మీరు ఆత్మలమని తెలుసుకోవడానికి ఆత్మను పొందటానికి రోజు ఎంతో సాధన చేస్తున్నారు, ఎంతో జ్ఞానాన్ని నేర్చుకుంటున్నారు.

కాని ఎవరైనా మనసు మలినంగా ఉన్నంత కాలం నేను ఆత్మ అని తెలుసుకోలేరు, ఆత్మ సాక్షాత్కార పొందలేరు. కాని మీరు ఈ మార్గంలోకి వచ్చిన తరువాత భగవంతుడి గురించి ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు.

లోకంలో భగవంతుడు ఉన్నాడు అని కొంతమంది, భగవంతుడు లేడు అని కొంతమంది అనుకుంటూ ఉంటారు. అసలు భగవంతుడు ఉన్నాడా? లేడా? ఉంటే ఆ భగవంతుడు సగుణుడా? నిర్గుణుడా? కనిపిస్తాడా? కనిపించడా? అని ఎన్నో సందేహాలు వస్తాయి.

ఈ ధ్యానమార్గంలోకి వచ్చిన మీకు మీ జ్ఞాన పరిధి పెరిగే కొద్దీ అన్ని రూపాలు ఆయనవే అంతా ఆయనే అని అర్థం చేసుకునే స్థాయికి, ఎదుగుతారు. అందుకే అవ్యక్తం అనేది వ్యక్తం ఎలా అవుతుంది? అన్నది తెలుసుకుందాం. భగవంతుడిని ఐదు రూపాలుగా చెప్పుకోవచ్చు. అవి ఏమిటంటే అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం. ఈ ఐదు భగవంతుని రూపాలు.

**1) అస్తి(సత్):** అస్తి అంటే ఉన్నది, వాస్తవమైనది, సత్యమైనది, శాశ్వతమైనది అని అర్థం. ఈ మార్గంలోనికి వచ్చిన మీరు భగవంతుడు అంటే నామ, రూప రహితుడు అని, సచ్చిదానంద స్వరూపుడు అని తెలుసుకున్నారు. అంటే ఆ భగవంతుడు శాశ్వతమైనవాడు, సత్యమైన వాడు, చైతన్య స్వరూపుడు, ఆనంద స్వరూపుడు అని తెలుసుకున్నారు. అందుకే ఆస్తి అన్నారు.

**2) భాతి (చిత్) :** భాతి అంటే చైతన్యవంతమైన అని అర్థం. భగవంతుడు అంటే సచ్చిదానంద స్వరూపుడు అని చెబుతారు. చిత్ అంటే చైతన్యవంతమైన,

ఈ గుణము బ్రహ్మాన్ని గుర్తించడానికి ఉపయోగిస్తుంది. భాతి అంటే సృష్టిలోని ప్రతీ దానికి చైతన్యం కలిగిస్తుంది అని అర్థము.

బ్రహ్మము ఇంద్రియాల ద్వారా గ్రహింపగలిగేది కాదు. జ్ఞానం ద్వారా మాత్రమే గ్రహించగలిగేది.

**3) ప్రియం (ఆనందం) :** ప్రియం అంటే ఆనంద స్వరూపం. ఆనందం అనే పదం బ్రహ్మానికి వర్తిస్తుంది. ఉపనిషత్తులు బ్రహ్మాన్ని ఆనందమయంగా వర్ణిస్తాయి, అంటే ఆత్మ లేదా బ్రహ్మము అనే దాని ముఖ్య గుణము ఆనందము అని తెస్తుంది. ఈ ఆనంద తత్వాన్ని ప్రియం అనే పదం సూచిస్తుంది.

ఈ మూడు కాకుండా భగవంతునికి ఇంకో రెండు లక్షణాలు ఉన్నాయి. అవి ఏమిటంటే? వ్యక్తమైన భగవంతుడికి ఒకటి రూపము, రెండు నామము ఉంటాయి. రూపము అంటే ఒక ఆకారం ఉంటుంది అంటే ఈ సృష్టిలో 84 లక్షల రకాల జీవరాశులకు రకరకాల ఆకారాలు ఉన్నాయి. ఒక్కొక్క జీవరాశికి బాహ్యంగా ఆకారం ఉంది, అంతరంలో ఆత్మ ఉంటుంది. మనం గమనిస్తే ఆకారమనేది వ్యక్తమైన భగవంతుడు.

మానవ జన్మ వచ్చేవరకు రకరకాల జన్మలలో అంటే పక్షిజాతి, వృక్షజాతి, పశుజాతి, క్రిమి కీటక జాతి, ఇలా ఒక్కొక్క జాతికి ఒక్కొక్క రూపం, నామం ఉంటుంది. అలాగే మానవ జన్మ వచ్చేటప్పటికి ఒక్కొక్కరికి ఒక్కో నామం అంటే పేరు ఉంటుంది, ఒక రూపం ఉంటుంది.

ఈ మార్గంలోనికి వచ్చిన మీరు గురువుల ద్వారా తెలుసుకునే జ్ఞానాన్ని బట్టి, స్వాధ్యాయం ద్వారా మీరు పొందే జ్ఞానాన్ని బట్టి మీరు ఆత్మలు, ఆత్మే భగవంతుడు అని తెలుసుకుంటారు. ఆత్మ యొక్క లక్షణం సచ్చిదానంద స్వరూపం అని, బయటకు కనపడేది మాత్రమే రూపం, నామం అని తెలుసుకుంటారు. రూపం, నామం అనేవి జన్మ తీసుకున్న తర్వాత వచ్చినవి. ఆత్మ అవ్యక్తం, రూపం, నామం లేకపోతే మానవుడు మానవుడే కాదు.

ఈ సృష్టిలో సమస్త జీవులకి రూపం ఉంది, నామము ఉంది ఇది వ్యక్త రూపం. అవ్యక్త రూపం అంటే అస్తి, భాతి, ప్రియం అంటే ఉన్నది ఆత్మ, అది చైతన్యం కలిగిస్తుంది, ప్రకాశం కలిగిస్తుంది, అదే ఆనంద స్వరూపం.

ఈ ఐదు మనం వరసగా చూసుకున్నప్పుడు అవ్యక్తంలో రూపం, నామం ఉండవు. ఆత్మ అంటే సచ్చిదానంద స్వరూపం అంటాం. మనం అందుకే వ్యక్తమైంది, వ్యక్తం కానిది కూడా భగవంతుడే అని మన జ్ఞాన పరిధి పెరిగే కొద్ది తెలుసుకుంటాం.

ఈ ధ్యానమార్గంలోనికి రాకముందు అజ్ఞానంతో ఉండటం వల్ల నేను దేహాన్ని అని, ఈ కనిపించే రూపమే నేను అని అనుకుంటాము. అజ్ఞానంలో ఉన్నవాడు రూపానికి, నామానికి ఎక్కువ విలువ ఇస్తూ వాటి కోసమే కష్టపడుతూ ద్వైతంలో బతుకుతూ ఉంటాడు. తమోగుణంలో ఉన్న మానవుడు ఈ ప్రపంచంలో కంటికి కనిపించే ఈ రూప, నామాలు నిజం అని, శాశ్వతం అని నమ్ముతాడు.

రూపానికి, నామానికి విలువిచ్చేవాడు ద్వైతంలో ఉంటాడు. రూపం, నామాలు కల్పించబడినవి కానీ శాశ్వతం అయినవి కావు. శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన ఆత్మను తెలుసుకోవాలి అంటే బాహ్య దృష్టిని వదలి అంతర్ దృష్టికి వెళ్ళిన వాడికే సాధ్యం అవుతుంది, శాశ్వత ఆనంద స్థితి లభిస్తుంది.

ఈ శరీరానికి శక్తిని ఇస్తున్నది ఎవరు? ఈ శరీరాన్ని కాపాడుతున్నది ఎవరు? ఈ శరీరం ఇలా నిలబడటానికి కారణం ఏమిటి? కొన్ని శరీరాలు విగత జీవులు అవుతున్నాయి, కొన్ని శరీరాలు ఎంత చక్కగా పనిచేస్తున్నాయి, మరణం అంటే ఏమిటి? ఎందుకు మరణం వస్తుంది? ఎందుకు భూమిమీద శాశ్వతంగా ఉండలేకపోతున్నారు? కొందరు దుఃఖంలో ఉన్నారు, బాధల్లో ఉన్నారు, ఇటువంటి సందేహాలు, వాటి గురించి తెలుసుకోవాలనే తపన

సాత్విక గుణంలోకి వచ్చినవారికి మొదలవుతుంది.

బుద్ధునికి కూడా అలాంటి తపన వచ్చింది. ఆయన బయటికి వెళ్ళినప్పుడు శవాన్ని, దుఃఖంలో ఉన్నవాళ్ళని, రోగగ్రస్తమైన వ్యక్తులని, బిచ్చగాడిని చూసి ఎందుకు అందరూ ఒక్క లాగే లేరు? ఎందుకు అందరూ సంతోషంగా లేరు? ఎందుకు మరణిస్తున్నారు? అనే సందేహం వచ్చినప్పుడు ఆయనలో తపన మొదలైంది. కారణం తెలుసుకోవాలని భార్య, కొడుకు, రాజ్యం ఇల్లు వదిలి ఏడు సంవత్సరాలు కష్టపడి సాధన చేసి తన సందేహాలన్నింటినీ నివృత్తి చేసుకున్నాడు. "ఆనాపానసతి" ధ్యానాన్ని తెలుసుకున్నాడు.

మీరు కష్టపడకుండా మీ ముందు తరాలు వాళ్ళు అంతా అన్వేషణ చేసి అన్నిటికీ కారణం బాహ్య దృష్టే అనే సత్యాన్ని మనకు చెప్పారు. బాహ్య దృష్టి ఉన్న మానవుడు కంటికి కనబడుతున్నదంతా సత్యం అనుకోవడం, నేను శాశ్వతం అనుకోవడం, ఈ ప్రపంచం శాశ్వతం అనుకోవడం, ఏది చేసినా నేనే చేస్తున్నాను అనే భావంలో వుంటారు. ఆ భావమే సమస్త దుఃఖాలకి కారణం అయింది.

ఈ భావం ఎందుకు వచ్చింది అంటే బాహ్య దృష్టిలో ఉన్నవాడికి రూపం, నామం చూసి సత్యాన్ని తెలుసుకోక, మనసు యొక్క ప్రభావంతో రూపాన్ని చూసుకుని మురిసిపోతూ, బాధలు కష్టాలు వచ్చినప్పుడు ఆవేదన చెందుతూ చిట్ట చివరగా సాత్విక గుణంలోకి వచ్చాక దీనికి కారణం ఏమిటి? అనే అన్వేషణ ప్రారంభం అవుతుంది. ఎప్పుడైతే మీలో ఆ తపన బయలు దేరిందో! ఆ తపన తీర్చడానికే గురువులు వస్తారు.

కారణం మీకు ఈ దుఃఖానికి కారణం తెలుసుకునే అంత ఖాళీ లేదు. ఇప్పుడు కలియుగంలో మానవుడు ఏదివచ్చినా నాకర్మ అనుకుంటూ అనుభవిస్తున్నాడు. లేకపోతే భగవంతుడికి నా మీద దయ లేదు అని ఒక

మాట అనుకుంటున్నాడు.

కానీ బాహ్య దృష్టిని అంతర్ దృష్టిగా మారుస్తేనే సత్యం బోధపడుతుంది. ఈ ద్వైత బుద్ధి పోయి అద్వైత బుద్ధిలోకి వచ్చినప్పుడు జ్ఞానం ఉదయిస్తుంది. అందుకే గురువులు బాహ్యంగా నువ్వు చూసేదంతా మిధ్య, ఈ సృష్టిలో సృష్టించబడినవన్నీ కూడా నశించేవి, రూపం, నామం శాశ్వతం కాదు అని చెప్తారు.

అస్తి, భాతి, ప్రియం అంటే సచ్చితానందం. ఈ మూడు శాశ్వతం అయిన ఆత్మ యొక్క లక్షణాలు. కాని వ్యక్తమైన భగవంతుడికి నామ,రూపాలు ఉంటాయి, కాని రూప,నామాలు నశించేవి. అవ్యక్తమైన ఆత్మకు ఆస్తి , భాతి, ప్రియం అన్న ఈ మూడు లక్షణాలే శాశ్వతమైనవి అని మీకు సత్యం అంటే ఏమిటో తెలిసిన రోజున తెలుసుకుంటారు.

మీరు అంతుర్ముఖమైన రోజున, సత్యం బోధపడిన రోజున దుఃఖం లేని స్థితిని పొందగలుగుతారు. మీరు ఆత్మానుభూతి పొందాలి అంటే వ్యక్తంలో జీవిస్తూ అవ్యక్తం గురించి ఆలోచించాలి. అంటే ఈ ప్రపంచంలో జీవిస్తూ నీ శరీరాన్ని సాధనకి ఉపయోగిస్తూ ఆత్మ జ్ఞానం పొంది ఆ భగవంతుడ్ని తెలుసుకోగలగాలి.

సచ్చిదానంద స్వరూపుడు అంటే అస్తి, భాతి, ప్రియం అనే లక్షణాలు కలిగిన శాశ్వతమైనవాడు. రూప,నామాలు శాశ్వతం అనుకుంటే అజ్ఞానంలో ఉన్నట్టే. అందుకే ద్వైతంలో ఉంటూ అద్వైతం తెలుసుకోవాలి.

ఆత్మ మీ శరీరాన్ని సాధన కోసం ఏరి కోరి తెచ్చుకున్నది, దాన్ని మర్చిపోయి మీరు శరీరాన్ని సుఖాలకు భోగాలకు ఉపయోగిస్తే దుఖం లోనే ఉంటారు, అదే యోగంలో ఉంచితే ఆనందంగా జీవిస్తారు. సాధన మర్చి పోయిన వాడికి వేదనే దిక్కు. అందుకే శరీరానికి ఏం కావాలో అవి ఇస్తూ అంటే స్థూల దేహానికి అన్నం, ప్రాణమయ కోశానికి గాలి ఇలా ఒక్కొక్క

కోశానికి ఒక్కొక్కటి అవసరం కాబట్టి ఆ అవసరాలన్నీ తీరుస్తూ మీ శరీరాన్ని సాధనకు ఉపయోగించాలి.

ఈ శరీరం సాధన కోసమేకాని భోగం కోసం కాదు. ఈ శరీరం "నేను ఎవరో?" తెలుసుకోవడానికి తెచ్చుకున్నాను అని తెలుసుకున్నప్పుడు, నామరూపాలన్నీ అశాశ్వతం, నామరూపం లేని సచ్చిత్తానంద స్వరూపుడైన ఆత్మ నాశరీరంలోనే ఉన్నాడు అని తెలుసుకుంటారు. అందుకే బాహ్యంగా జ్ఞానం సంపాదించాలి. అందుకే గురువులు బుద్ధిని పెంచుకో అని చెబుతుంటారు. వారి ద్వారా తెలుసుకున్న జ్ఞానం బుద్ధిలో నిక్షిప్తమవ్వాలి. మీ బాహ్యదృష్టిని అంతర్ దృష్టిగా మార్చుకోవాలి, అప్పుడు నువ్వు ఆత్మని వీక్షించగలవు.

నీ అంతరంలోకి వెళ్ళే కొద్దీ నామరూపాలన్నీ మిథ్యే, అంతరంలోని ఆత్మే సత్యం అని తెలుస్తుంది. అందుకే చూడండి ధ్యానం లోకి వచ్చిన మొదట్లో వ్యవహారాలు చూసుకుంటూ, కొంతసేపు ధ్యానం చేస్తారు. ఆత్మానుభూతి పొందే కొద్ది ధ్యాన సమయాన్ని పెంచుతూ అంతర్దృష్టిని పెంచుకోవడానికి, ఆత్మని దర్శించడానికి ప్రయత్నిస్తారు. అందుకే జ్ఞానం పెంచుకోవడం మీద దృష్టి ఉండాలి, ఆత్మ దృష్టి అంటే ఈ వ్యక్త రూపాలన్నిటికీ కారణం ఆత్మే అని, వ్యక్తం, అవ్యక్తం రెండిటికీ కారణం భగవంతుడే అనే సర్వాత్మ భావనలోకి రావాలి.

సర్వాత్మ భావన అంటే నేను చూడగలిగింది, చూడలేనిది అన్నీ కూడా భగవంతుడి యొక్క సృష్టే అనే భావన. ఇప్పుడు మీరు చూసే ప్రపంచం చాలా చిన్నది. సృష్టి అంటే మన కంటికి కనిపించేదే కాదు, కంటికి కనిపించని ఎన్నో లోకాలు ఉన్నాయి.

అందుకే ఆ నారాయణుడి యొక్క శక్తి, చూడగలిగిన దాంట్లో... చూడలేని దాంట్లో... లోనా బయట అంతటా... అన్నిటా ఉంటుంది. సాధన

చేసి జ్ఞానం పెంచుకుని, ఆత్మ దృష్టి పెరిగినప్పుడు అంటే మూడో కన్ను వచ్చినప్పుడు ఆ పరంలో ఉన్న లోకాలను కూడా దర్శించగలరు. అందుకే మీకు ధ్యానంలోకి వచ్చే వరకు బాహ్య దృష్టి ఎక్కువగా ఉంటుంది. గురువుల ద్వారా బాహ్య దృష్టిని తగ్గించుకుని అంతర్దృష్టిని పెంచుకోవాలి. ఎందుకంటే కనిపించే ఈ లోకం చాలా చిన్నది, కనబడని విశ్వం చాలా ఉంది కాబట్టి చాలా తెలుసుకోవాలంటే నువ్వు బాహ్యంలో కనిపించేవి చూస్తూ ద్వందంలోనే ఉండిపోకూడదు.

అద్వైతం అంటే ఒక వస్త్రాన్ని తీసుకుంటే ద్వైతంలో ఉన్నవాళ్ళు దారం వేరు వస్త్రం వేరు అనుకుంటారు, అద్వైతంలో ఉన్నవాడు దారం వేరు వస్త్రం వేరు కాదు అంతా వస్త్రమే అంటాడు అంటే ఆ వస్త్రంలో ఉన్నవన్నీ నూలు దారాలే కాబట్టి.

ద్వైతములో ఉన్నవాడు భగవంతుడు వేరు, సృష్టి వేరు అంటాడు. కానీ అద్వైతంలో ఉన్నవాడు కనిపిస్తున్నది, కనిపించనిది అన్నిటా ఉన్నది ఆత్మ చైతన్యమే, ఇంక వేరే ఏమీ లేదు అని తెలుసుకుంటాడు. అహం బ్రహ్మాస్మి, తత్వమసి, సర్వం ఖల్విదం బ్రహ్మ, అంటే సృష్టి అంతా బ్రహ్మమయమే అని తెలుసుకుంటాడు. వ్యక్తమైన రూపాల వెనకాల అవ్యక్తమైన ఆత్మ ఉంది. కాని ఈ వ్యక్తం నశిస్తుంది, అవ్యక్తం నశించదు అని అద్వైతములో ఉన్నవాడికి తెలుస్తుంది.

# "జగత్ మిథ్య, ఆత్మ సత్యం" ఎలా అయింది?

శంకరాచార్యులు "జగత్ మిథ్య, ఆత్మ సత్యం" అని బోధించారు. కానీ మన కంటికి కనిపించే "జగత్ మిథ్య ఎలా అయింది? కనిపించని "ఆత్మ" సత్యం ఎలా అయింది? అనే సందేహాలు ఎన్నో మీకు రావచ్చు. ఒక జ్ఞాని తనకు వచ్చే ప్రతి సందేహాన్ని తీర్చుకుంటూ సాధనలో పురోగమనం సాధించాలి. అందుకే "జగత్ మిథ్య, ఆత్మ సత్యం" ఎలా అయిందో మనం వివరించుకుందాం.

శంకరాచార్యుల వారు ఎంతో గొప్ప జ్ఞానులు, ఆయన చెప్పారు అంటే అది సత్యం. కానీ మనలో ప్రతి ఒక్కరికి మన కంటికి కనిపించే సృష్టి లేదంటున్నారు, కంటికి కనిపించని ఆత్మ సత్యం అంటున్నారు, అది ఎలా? అనే సందేహం కలుగుతుంది. నాకు కూడా చాలా రోజుల నుండి ఈ సందేహం ఉంది.

మన సందేహాలన్ని గురువుల ద్వారా, పుస్తకాల ద్వారా తీర్చుకుంటూ ఈ మార్గంలో పురోగమనం సాధించాలి. ఏ విషయంలోనైనా మీకు పూర్తి క్లారిటీ వస్తేనే మీరు ఇతరులకు అర్థమయ్యే రీతిలో బోధించగలరు, సరైన అవగాహన లేనప్పుడు మీరు బోధించలేరు. పత్రి గారు కూడా ఎన్నో సందేహాలకు అందరికీ అర్థమయ్యే రీతిలో చక్కటి వివరణ ఇచ్చేవారు.

ఈ జగత్ అంతా సత్యమా, అసత్యమా అనే మిమాంసలో అందరూ ఉంటారు. కానీ ఇది సత్యము కాదు, అసత్యము కాదు మిథ్య అని శంకరాచార్యులు చెప్పారు. ఈ జగత్తు సృష్టించబడింది కనిపిస్తూ ఉంటుంది. కానీ ఇది సత్యం కాదు అని చెప్తూ ఒక మాట చెప్పారు. మిథ్య అంటే ఎల్లప్పుడూ కనిపించేది కాదు, కనిపించనిది కాదు కనిపిస్తూ కనిపించనిదే మిథ్య.

మిథ్య అంటే మనం చూస్తున్నప్పుడు మాత్రమే కనిపించి, మనం

చూడనప్పుడు కనిపించకుండా ఉండేది, ఎలా అంటే మన మనసు ఉన్నప్పుడు ఈ ప్రపంచం అంతా కనిపిస్తుంది అంటే “జాగృదావస్థ”లో మనం చూస్తూ ఉన్నప్పుడు కనిపిస్తుంది.

అలాగే “స్వప్నావస్థలో” మనం నిద్రిస్తున్నప్పుడు కలలు వస్తూ ఉంటాయి. అటువంటప్పుడు కూడా మనము మనసుతో ఈ ప్రపంచం చూడవచ్చు.

కాని “సుషుప్తిలో” మనసు పనిచేయనప్పుడు అంటే ఏ సంకల్పం, ఏ అలజడులు, ఏ కోరికలు, ఏ ఆగ్రహావేశాలు లేనప్పుడు ఆ స్థితిలో మనసు పనిచేయదు, కాబట్టి ప్రపంచమే లేదు.

ఈ మూడు అవస్థలు తీసుకుంటే “జాగ్రదావస్థ”లో మనసు పనిచేస్తుంది, “స్వప్నావస్థ”లో మనసు పనిచేస్తుంది. అంటే ఈ రెండు అవస్థల లో వారు మీ చుట్టూ ఉండే ప్రపంచంతో కనెక్ట్ అయ్యే ఉంటారు. కానీ సుషుప్తావస్థ లో మనసు పనిచేయదు కాబట్టి ప్రపంచంతో కనెక్ట్ అయి వుండరు.

కలల్లో కూడా మీరు ఊహించుకున్న ప్రపంచం ఉంటుంది, అంటే బాహ్యంలో మీ ఆలోచనలు అన్నీ కలల రూపంలో స్వప్నావస్థలో మీకు కనపడతాయి. కానీ గాఢ నిద్రలో మీ మనసు నిశ్చింతగా ఉంటుంది, మనకు ఏ చింతలు లేనప్పుడు, ఏ కోరికలు లేనప్పుడు నిద్ర బాగా పడుతుంది, ఆ స్థితిలో అంటే సుషుప్తావస్థలో ప్రపంచమే వుండదు.

మీరు గమనిస్తే గాఢంగా నిద్రపోయిన రోజు తెల్లవారి లేచిన తర్వాత “ఈరోజు బాగా నిద్ర పట్టింది నాకు నిద్రలో ఏమీ తెలియలేదు” అని చెబుతారు. దీనిని బట్టి జాగ్రదావస్థలో “జాగ్రద ప్రపంచం” ఉంది, స్వప్నావస్థలో “స్వప్న ప్రపంచం” ఉంది, కానీ మనస్సు పనిచేయని సుషుప్తిలో ఏ ప్రపంచమూ లేదు. ఈ విషయమే శంకరాచార్యులు వారు చెబుతున్నారు “ఒకప్పుడు ఉండి ఒకప్పుడు లేకుంటే” అది మిథ్య, కానీ ఈ మూడు అవస్థల్లో నీ ఆత్మ పని

చేస్తూ ఉంటుంది. అందుకే "ఆత్మ సత్యం జగత్ మిథ్య" అయింది అని చెప్పడం జరిగింది.

శంకరాచార్యులు మనకు ఇంకా అర్థం కావాలని ఒక చక్కని ఉదాహరణ చెప్పారు.

మీరు అద్దంలో చూసుకున్నప్పుడు మీ ప్రతిబింబం మీకు కనపడుతుంది. కానీ ఆ ప్రతిబింబంలో కనపడేది అసలైన మీరు కాదు కదా? మీ రూపం కనపడుతుంది కానీ మీరు కాదు. అంటే ఇక్కడ మీరు గమనిస్తే బింబం మీరు, అద్దంలో కనబడే ప్రతిబింబం కాదు, బింబం సత్యం ప్రతిబింబం అసత్యం అని మీరు అర్థం చేసుకోవచ్చు.

ప్రతిబింబంలో కూడా అచ్చం మీలాగే ఉంటారు. మరి అసత్యం ఎందుకు అవుతుంది? మీరు గమనిస్తే ప్రతిబింబంలో కొన్ని మార్పులు ఉంటాయి, అద్దంలో మీకు కుడి చేయి, ఎడమ చేయి గాను, ఎడమ చేయి కుడి చేయి గాను కనపడతాయి. అంటే కుడి వైపున వస్తువులు ఎడమ వైపు గాను ఎడమ వైపున వస్తువులు కుడి వైపు గాను కనపడతాయి. అంటే కుడి ఎడమ అవుతుంది, ఎడమ కుడి అవుతుంది,

అలాగే నీ మనసు యొక్క కల్పితంతో జరిగిన ఈ జగత్తు మిథ్య కానీ సత్యం కాదు. నీ మనసులో నుంచే వచ్చింది ఈ ప్రపంచం. మనసు కూడా ఆత్మ నుంచే పుట్టింది, మనసుకు శక్తి ఆత్మ నుండే వచ్చింది.

మరి బింబానికి, ప్రతిబింబానికి తేడా ఎలా ఉందో! ఆత్మకి, జగత్తు కి కూడా తేడా ఉంది. అంటే ఆత్మ అవ్యక్తం, ప్రపంచం వ్యక్తం కానీ నీ మనసును బట్టి అది మారుతూ ఉంటుంది కానీ ఆత్మ మారదు.

అద్దం దూరంగా ఉంది అందులో మీరు చూస్తున్నప్పుడు మీరు చాలా దూరంగా ఉన్నట్టు ఉంటుంది. కానీ మీరేమీ చాలా దూరంగా లేరు, దగ్గరగానే ఉన్నారు. కానీ ఈ అద్దము దూరము, దగ్గర వల్ల మీరు తేడాగా కనిపిస్తున్నారు. కుడి వైపు ఉన్నది ఎడమవైపుగా ఎడమవైపు ఉన్నది కుడివైపుగా

కనిపిస్తున్నారు. అంటే అక్కడ అద్దంలో తేడాగా కనిపిస్తున్నారు కానీ మీరు మీరు గానే ఉన్నారు.

మీరు గమనిస్తే ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి ఒకరికి మంచిగా కనబడతాడు, అదే వ్యక్తి ఇంకొకరికి చెడ్డగా కనపడతాడు. మరి ఒకడికి మంచివాడిగా కనిపించినప్పుడు ఇంకొకడికి చెడ్డగా ఎందుకు కనపడ్డాడు? అంటే వారి మనస్సు యొక్క స్థితిని బట్టి వాడు కనపడతాడు. ఈ సృష్టి అంతా మనస్సు స్థితిని బట్టి ఏర్పడింది ఈ విషయమే మనకి శంకరాచార్యులు చెప్పారు.

గురువులు పదే పదే ఈ విషయాన్నే ఎందుకు చెబుతున్నారు అంటే మనసు యొక్క ప్రభావం వలన అసత్యాన్ని సత్యము అనుకుంటూ అసత్యంలోనే జీవిస్తూ, కోరికల వెంట పడుతూ, సత్యమైన నిత్యమైన ఆత్మను విస్మరిస్తున్నారు, కాబట్టి ఈ ప్రపంచం అంతా మిథ్య. మనసును బట్టి ఈ ప్రపంచం ఉంది కానీ ఆత్మను బట్టి కాదు. ఆత్మ క్షణక్షణం మార్పు చెందదు కాబట్టి ఆత్మ సత్యం, ఆత్మ నిత్యం.

ఉదాహరణకు ఒక మెజీషియన్ తీసుకుంటే మెజీషియన్ మ్యాజిక్ చేస్తూ ఉంటాడు. వాడి మ్యాజిక్ తో అక్కడే ఉన్న వ్యక్తిని మాయం చేస్తాడు, రంపంతో కోసినట్లు చూపిస్తాడు, లేని పువ్వులను సృష్టిస్తాడు, లేని పక్షలను సృష్టిస్తాడు. అక్కడ మీకు కనపడేదంతా నిజం కాదు, నిజం అనే భ్రమలో మిమ్మల్ని పడేస్తాడు.

అలాగే ఈ ప్రపంచం కూడా ఒక మిథ్య. మీ మనసు ప్రభావంతోనే ఉన్నది లేనట్టుగా కనపడుతుంది, లేనిది ఉన్నట్లుగా కనపడుతుంది. ఇది భగవంతుడి ఆట అని  చెప్పుకోవచ్చు.

మరి ఈ విధంగా ఈ ప్రపంచం మిథ్య అన్నారు అంటే మీరు చూడగలిగినప్పుడు ఈ ప్రపంచం ఉంది. మీరు చూడకుండా గాఢనిద్రలో ఉన్నప్పుడు కూడా ఈ ప్రపంచం ఉంది కానీ జాగ్రదావస్థలో ఉన్నప్పుడు మీరు

మనసుతో ఉంటారు కాబట్టి ఈ ప్రపంచం కనపడుతుంది. కానీ సుషుప్తి అవస్థలో మనస్సు లేదు కాబట్టి ఈ ప్రపంచం కనపడదు అలా అని ఈ ప్రపంచం లేదా అని కాదు కదా?

అలాగే బింబానికి, ప్రతిబింబానికి తేడా ఉంది మీరు అద్దంలో చూసుకుంటేనే ప్రతిబింబం ఉంటుంది అదే అద్దం ప్రక్కన పెట్టేస్తే ప్రతిబింబం ఉండదు. అలాగే మీ మనసు ఉన్నప్పుడు ప్రపంచం ఉంది. మీ మనసులో ఏ ఆలోచనలు, సంకల్పాలు లేకుండా గాఢ నిద్రలో ఉన్నప్పుడు ప్రపంచమే లేదు. ఉండి లేనట్టు ఉండేదంతా మిధ్య. అలాగే వివిధ రూపాలతో ప్రత్యక్షంగా కనబడుతున్న ఈ విశ్వం అంతా మిధ్యే, ఎన్నో రూపాలుగా కనిపిస్తుంది.

ఆత్మకు కనిపించేది, వినిపించేది అంతా మిథ్య. శాశ్వతంగా ఉండేది సత్యం, శాశ్వతంగా లేని వన్నీ కూడా క్షణకాలం మిద్య. జాగ్రదావస్థలో కనిపిస్తుంది, స్వప్నావస్థలో కనిపిస్తుంది సుషివ్వస్థలో కనిపించట్లేదు. మళ్ళీ నీకు మెలుకువ రాగానే కనిపిస్తుంది.

ఈ సృష్టిలో మనుషులైనా, జీవులైన, జీవరాసులైన మొదలైనవి ఏమైనా సరే కొన్నాళ్లుండి, కొన్నాళ్లు లేకుంటే అది మిథ్య, శాశ్వతంగా ఉండేదే సత్యం అదే "ఆత్మ" అని శంకరాచార్యులవారు భోదించడం జరిగింది.

సహజంగా అందరు ఏమనుకుంటారంటే ఈ శరీరం శాశ్వతం, మనసు శాశ్వతం, బుద్ధి శాశ్వతం అని అనుకుంటారు. కానీ కంటికి కనిపించే ఈ మేను అశాశ్వతం కానీ ఈ మేను లోపల ఉన్న ఆత్మ శాశ్వతం. ఈ శరీరం కంటికి కనిపిస్తుంది, సత్యంలా అనిపిస్తుంది, కానీ కొన్నాళ్ళే ఈ భూమ్మీద ఉంటుంది కాబట్టి మిథ్య. కనిపించని "ఆత్మ" సత్యం.

శంకరాచార్యులు వారు చెప్పిన ఇంకొక ఉదాహరణ చూద్దాం. ఆత్మ యొక్క ఒక లక్షణం "సచ్చిదానంద స్వరూపం": సత్ అంటే సత్యమైంది, చిత్ అంటే చైతన్యవంతమైంది, ఆనందం అంటే ఆనంద స్వరూపం, ఎప్పుడు

ఆనందంగా ఉండేది సచ్చిద్దానందస్వరూపం.

అవ్యక్తంగా ఉన్న ఆత్మ యొక్క లక్షణం సచ్చిదానంద స్వరూపం. వ్యక్తమైన ఆత్మ అంటే మీరు అద్దంలో చూసుకున్నప్పుడు కుడి ఎడమ, ఎడమ కుడిగా ఎలా  కనిపిస్తుందో అలానే వ్యక్తమైన ఆత్మ అంటే సత్యం అసత్తుగా అయిపోతుంది అంటే ఆత్మ అసత్యం, జడం దుఃఖం అవుతుంది.

ఉదాహరణకు మీరు గమనిస్తే ఒక చెట్టులో ఆత్మ శక్తి ఉంటుంది కానీ అది కదలలేదు అంటే జడంగా ఉంటుంది, అలానే ఒక మనిషి వ్యక్తమవుతున్నాడు కానీ దుఃఖంలోనే ఉన్నాడు ఎందుకంటే ఆత్మ శక్తి లేకపోవటం, అజ్ఞానంలో ఉండటం వలన.  అందుకే ఆత్మ అవ్యక్తంలో సచ్చిదానందం, వ్యక్తంలో అసత్తు, జడము, దుఃఖము.  వ్యక్తం నశించేది, అవ్యక్తం శాశ్వతం.

అందుకే అవ్యక్తమైన ఆత్మ అంటే కనబడని ఆత్మ సచ్చిదానంద స్వరూపం అయితే, వ్యక్తమైన అంటే కంటికి  కనిపించే జగత్తు అసత్తు, జడము, దుఃఖం అనే మూడు లక్షణాలు ఉంటాయి.

లోకంలో మానవుడికి దుఃఖం ఉంది, కొన్ని జడమై ఉన్నాయి, కొన్ని పుట్టిన వెంటనే రాలిపోతాయి శాశ్వతం కాదు ఈ విధంగా అవ్యక్త రూపానికి ఉన్న లక్షణాలు చెప్పాడు. వ్యక్త రూపానికి ఉన్న లక్షణాలు కూడా శంకరాచార్యులు చెప్తూ మరి ఎన్నో విధాలుగా కాసేపు ఉండి కాసేపు లేనిది, కొన్నాళ్ళు ఉండి కొన్నాళ్ళకి లేనిది ఇదంతా జగత్తే... ఆత్మ ఒక్కటే సత్యం, మార్పు లేనిది, మార్పు ఉన్న ప్రతిది కూడా నశిస్తుంది. రూపం ఉన్న ప్రతిది కూడా నశిస్తుంది.

సృష్టించబడిన ప్రతిది కూడా నశింపు ఉంది కాబట్టే "జగత్తు మిథ్య, ఆత్మ సత్యం" అని ఒక చక్కని ఉదాహరణతో మీకు బోధించారు. ఈ సృష్టిలో ప్రతిదీ కూడా అసత్య రూపం, నశించిపోతుంది అని మీకు తెలుసు, అందుకే ఈ సృష్టి అనేది అసత్తు. ఆత్మే సత్యం అని మీకు బాగా అర్థమయింది.

ఈ సృష్టిలో చరాచర అంటే సంచరించేవి, సంచరించనివి వున్నాయి. ఉదాహరణకు కొండలు, వృక్షాలు సంచరించవు. జడంగానే ఉంటాయి. ఆ పరమాత్మ చైతన్యంతోనే వ్యక్తమవుతున్నాయి కానీ అవి జడాలు.

దుఃఖం అనేది ప్రతి జీవికి ఉంటుంది, మానవుడికి ఉంటుంది. జీవులకి దుఃఖం ఉండదు అనుకుంటారు కానీ మానవుడు వాటిని సంహరిస్తూ ఉంటాడు కదా? తినడానికి చంపుతూ ఉంటాడు, చంపే ముందు అవి చాలా దుఃఖాన్ని అనుభవిస్తాయి. ఎందుకంటే మానవుడు దగ్గరకు వెళ్ళేటప్పటికి మీ మనసు యొక్క ఆలోచన ఆ జీవులకు తెలిసి అది ఎంతో వేదనకి గురవుతూ ఉంటుంది. అందుచేత జీవులు దుఃఖం అనుభవిస్తాయి అని మీరు తెలుసు కోవచ్చు.

మానవుడు సత్యమేమిటో తెలుసుకోలేక, శాశ్వతమైనది తెలుసుకోలేక, ప్రపంచమే శాశ్వతమని బంధాలలో ఇరుక్కుపోయి, రాగ ద్వేషాలతో ఉండడం వల్ల ఎప్పుడూ దుఃఖంలో ఉండిపోతున్నాడు. అందుకే జగత్తు మిథ్య అని ఒక మాటలో చెప్పారు శంకరాచార్యులవారు. ఈ సృష్టిలో సృష్టించబడినవి అన్నీ దుఃఖాన్ని మిగులుస్తాయి.

మానవుడు అజ్ఞానంలో ఉన్నప్పుడు ప్రతిది కావాలని కోరుకుంటాడు, ఆ కోరికలనే సంకల్పాలుగా పెట్టుకుని దుఃఖం లో ఉండిపోతాడు. కానీ ఏ సంకల్పాలు, కోరికలు లేకుండా మనసును ఎప్పుడైతే నిశ్చలం చేసుకుంటాడో అప్పుడే ఆత్మ అని తెలుసుకుంటాడు, ఆత్మ దర్శనం పొందుతాడు.

మరి అసత్తుని కోరుకోకూడదు దాని వల్ల కూడా దుఃఖం వస్తుంది. సృష్టించబడింది ప్రతిది అసత్తే, రూపం ఉన్నది అసత్తు, సృష్టించబడేది అసత్తు.

ఎన్నో జన్మలలో, ఎన్నో పాఠాలు నేర్చుకుంటూ చివరికి మానవ జన్మ తీసుకొని జీవుడిగా ఉన్న మానవుడు దేవుడుగా ఎదగడం కోసం తామరాకు మీద నీటి బొట్టులా జీవిస్తూ అంటే ఈ ప్రపంచం లోనే ఉంటూ వేటిని అంటించుకోకుండా జీవిస్తాడు.

ఈ పంచభూతాల ద్వారా తయారైన ఈ సృష్టిని మీరు అనుభవిస్తూ మీరు ఎవరో తెలుసుకోవడానికి భూమి మీదకి వచ్చారు, కానీ అవి అనుభవించడానికి మాత్రమే ఉన్నాయి కానీ నా సొంతం అయిపోవాలి అని అనుకుంటే దుఃఖంలోనే ఉండిపోతారు.

ఈ శరీరము శాశ్వతం కాదు, మీరు కోరుకున్నది శాశ్వతం కాదు. అశాశ్వతమైన శరీరంతో, శాశ్వతమైన భగవంతుడిని తెలుసుకోవడం కోసమే మీరు ఈ భూమ్మీదకి వచ్చారు. అందుకే మీకు కనిపిస్తున్న దంతా మిథ్య. అది తెలియక మానవుడు ఈ ప్రపంచం శాశ్వతం అని దుఃఖంలో ఉండిపోతున్నాడు.

మీలో కోరిక ఎప్పుడైతే ఉందో ప్రపంచం సత్యం అయిపోయినట్లే. ఈ సృష్టిలో ఏదైతే కోరుకుంటున్నావో అంటే ఇది నాకు కావాలి, నా సొంతం అని అనుకున్న క్షణమే ఈ ప్రపంచం సత్యము అనే భావంలో ఉండిపోతారు.

నేను సచ్చిదానంద స్వరూపుడను అని తెలుసుకోవాలి అంటే ఈ జడమైన పదార్థాలు, ఈ అసత్యమైనవి, ఈ దుఃఖకరమైన ఈ జగత్తు నుంచి ఏమీ కోరకుండా, ఉన్నవి అనుభవించడానికే సృష్టి జరిగింది అని తెలుసుకోవాలి. మానవుడు మాధవుడు అవ్వాలి అంటే ఉన్నదానితో సరిపెట్టుకుంటూ తృప్తిగా జీవిస్తూ సాధన చేయాలి.

శంకరాచార్యులవారు ఎంతో వివరంగా మీకు చెప్పినప్పుడు మీరు నిత్యం ధ్యానం చేయాలి, జ్ఞానం పొందాలి. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్న మాయకు వశమై మరలా ఈ జగత్తునే కోరుకుంటారు. మీ జీవితంలో నిత్యం ఆహారము, నిద్ర ఎలా ఒక భాగమయ్యాయో, ధ్యానం చేయడం, జ్ఞానం పొందడం కూడా ఒక భాగం అయిపోవాలి.

శంకరాచార్యుల ద్వారా జగత్తుకు ఉన్న లక్షణాలు, ఆత్మకు ఉన్న లక్షణాలు చాలా వివరంగా తెలుసుకున్నారు. దీన్ని బట్టి మీకు "జగత్ మిథ్య, ఆత్మ సత్యం" అని బాగా అర్థమవుతుంది.

# తేటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించకముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) కబీరు సందేశాలు-1 -రూ.70/-
43) కబీరు సందేశాలు-2 -రూ.60/-
44) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
45) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
46) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
47) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
48) అతీంద్రియ శక్తులు - రూ.60/-
49) ఆలోచించండి - రూ.60/-
50) నిర్వాణ మార్గం - రూ.60/-
51) ధ్యానులకు సూచనలు - రూ.60/-
52) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
53) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
54) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
55) సంకల్పమంటే? - రూ.50/-
56) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
57) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
58) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
59) అరిహంత్ - రూ.50/-
60) చివటం అమ్మవారి సందేశాలు - రూ.50/-
61) మూడురకాల జీవితాలు -రూ.40/-
62) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
63) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
64) బ్రహ్మం అంటే? -రూ.40/-
65) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం-రూ.40/-
66) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
67) మహాత్ముల సందేశాలు - రూ.40/-
68) సత్యం - రూ.40/-
69) చక్రాలు - రూ.40/-
70) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
71) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
72) మౌన ధ్యానం - రూ.40/-
73) విదురుని సందేశాలు - రూ.40/-
74) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
75) శాకాహారమే మానవాహారం - రూ.15/-
76) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



మీ జీవితంలో విజయం సాధించాలి అంటే సాధన ఒక్కటే సరిపోదు, జ్ఞానం నేర్చుకోవాలి, గురువుల ద్వారా విన్న ప్రతి విషయాన్ని ఆచరణలో పెట్టుకోగలగాలి, అప్పుడే ఈ మార్గంలో మీరు ఎదగడమే కాదు, జీవితంలో విజయం సాధించగలరు. మీలో ఉన్న ఈ లోపాలు అని గమనించుకొని వాటిని సరిచేసుకోవాలి.

1) "ప్రతిక్షణం మిమ్మల్ని మీరు గమనించుకోవాలి"

2) "మన జీవితంలో ఏమి జరుగుతున్నా స్వీకరించగలగాలి:"

3) "విజయానికి తొలి మెట్టు అపజయమే అని గుర్తుపెట్టుకొని అపజయాలకు భయపడకుండా ముందుకు సాగితే విజయం మీదే అని గుర్తు పెట్టుకోండి."

4)"ద్వేషం, అసూయ, పగ, ప్రతీకారం అనేవి జీవితంలో వుండకూడదు:"

5) "భగవంతుడు మన చేత గొప్ప పనులు చేయించాలని అనుకుంటే ముందు చిన్న చిన్న పనులు మనకి ఇస్తాడు. అవి చిన్న చిన్న పనులే కదా! అని మీరు నిర్లక్ష్యంగా వదిలివేస్తే పెద్ద పనులు చేసే అవకాశం మీకు రాదు."

\- బ్రహ్మావిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.40/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|